RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 165 | జులై 16 గురువారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 165 | July 16 Thursday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


బోనాల ఉత్సవాలు రాష్ట్రానికే ప్రత్యేకమైన శక్తి ఆరాధనా పండుగ 2

## నదులు అనుసంధానం చేయాలి

ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



**అమరావతి జనసంఘర్షణ**

రాష్ట్రంలో నదుల అనుసంధాన ప్రక్రియను పూర్తి చేయడం ద్వారా కరువు రహిత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వంశధార - పెన్నా నదుల అనుసంధానాన్ని ఒక ధ్యేయంగా పెట్టుకున్నామని, రాబోయే మూడేళ్ల కాలంలో రూ.35 వేల కోట్లు వెచ్చించి ప్రాధాన్యత క్రమంలో 36 నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ఆయన ప్రకటించారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వద్ద నిర్వహించిన జలహారతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి సాంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా గంగా-కావేరి నదుల అనుసంధానం జరిగితే దేశ రూపురేఖలే మారిపోతాయని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును మార్చి 2027 నాటికి వంద శాతం పూర్తి చేసి దేశానికి అంకితం చేస్తామని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. అలాగే, ఈ నెలలోనే గుంటూరు ఛానల్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు, ఇప్పటికే పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తయినందున ఆగస్టు 14న అనకాపల్లి జిల్లాలో గోదావరి జలాలకు జలహారతి ఇవ్వనున్నట్లు తెలిపారు. సెప్టెంబరు 1న వెలిగొండ ఫేజ్-1 ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామన్నారు. గతంలో పట్టిసీమ ప్రాజెక్టును నిర్మిస్తున్నప్పుడు కొందరు రాజకీయ కారణాలతో 'ఒట్టిసీమ' అంటూ తీవ్ర విమర్శలు చేశారని, ఆ ఆరోపణలను పట్టించుకోకుండా రూ.1,300 కోట్లతో ఏడాదిలోనే పూర్తి చేయడం వల్లే నేడు కృష్ణా డెల్టా సస్యశ్యామలమైందని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి నుంచి కృష్ణా నదికి 450

## ఫ్యూచర్ సిటీలో అమెజాన్ కీలకం

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ జనసంఘర్షణ**

తెలంగాణ రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలకు సింగిల్ విండో విధానం ద్వారా వేగంగా అనుమతులు ఇస్తున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడుల పురోగతిపై ప్రతి నెలా ప్రత్యేక సమీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. హైదరాబాద్ శివార్లలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో అమెజాన్ వెబ్ సర్వీసెస్ నూతన హైపర్‌స్కేల్ డేటా సెంటర్ నిర్మాణానికి సీఎం బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. ఫ్యూచర్ సిటీ సమగ్ర అభివృద్ధిలో అమెజాన్ డేటా సెంటర్ అత్యంత కీలక పాత్ర పోషించబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యంత అధునాతనంగా రూపుదిద్దుకుంటున్న ఈ నగరంలో మరిన్ని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్లను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ కీలక భాగస్వామిగా ఎదుగుతోందని, దేశ జీడీపీలో రాష్ట్ర వాటాను

➤ మిగతా 2వ పేజిలో..

## విమాన ప్రమాద దర్యాప్తు తుది దశకు

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు



**అహ్మదాబాద్ జనసంఘర్షణ**

అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టులో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాద దర్యాప్తు తుది దశకు చేరుకుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ఈ ఘోర ప్రమాదానికి గల అసలు కారణాలను వెలికితీయడమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని, అతి త్వరలోనే దీనికి సంబంధించిన తుది నివేదిక వెలువడుతుందని ఆయన స్పష్టం చేశారు. దర్యాప్తు బృందం సమర్పించబోయే నివేదికపై తమకు పూర్తి నమ్మకం ఉందని ఆయన పేర్కొన్నారు. గత ఏడాది జూన్ 12న అహ్మదాబాద్ విమానాశ్రయంలో

➤ మిగతా 2వ పేజిలో..

## ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ డిశ్చార్జ్

**బొంబాయి జనసంఘర్షణ**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ముంబైలోని ప్రముఖ కోకిలాబెన్ ఆసుపత్రి నుంచి శస్త్రచికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యారు. గత కొంతకాలంగా కుడి భుజం నొప్పితో బాధపడుతున్న ఆయనకు వైద్యులు విజయవంతంగా సర్జరీ పూర్తి చేయడంతో, క్షేమంగా నివాసానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణ్ భార్య అన్నా లెజినోవా సోషల్ మీడియా వేదికగా షేర్ చేసిన ఒక భావోద్వేగ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట విపరీతంగా వైరల్ అవుతోంది.




## వాహనానికి చార్జింగ్ పెడుతుండగా షాక్

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

నోయిడాలో ఎలక్ట్రిక్ వాహనం ఛార్జింగ్ పెడుతుండగా జరిగిన ఘోర ప్రమాదం ఇద్దరి ప్రాణాలను బలిగొంది. ఢిల్లీ శివారు ప్రాంతమైన నోయిడా సెక్టార్ 66, మమురా గ్రామంలోని ఒక నివాస భవనంలో బుధవారం ఈ విషాదం చోటుచేసుకుంది. భవనం గ్రౌండ్ ఫ్లోర్ పార్కింగ్ ఏరియాలో ఒక ఎలక్ట్రిక్ స్కూటర్‌కు ఛార్జింగ్ పెడుతున్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ మంటలు క్షణాల్లోనే పక్కనే నిలిపి

➤ మిగతా 2వ పేజిలో..

## తెలంగాణాలో సర్ పొడగింపు




**హైదరాబాద్ జనసంఘర్షణ**

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ - ప్రక్రియ గడువును కేంద్ర ఎన్నికల సంఘం ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించింది. నిజానికి ఈ ప్రక్రియపై చాలా జిల్లాల్లో సరైన అవగాహన లేకపోవడంతో నమోదు కార్యక్రమం చాలా మందకోడిగా సాగింది. గడువు ముగుస్తున్న తరుణంలో ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ గడువును పెంచాలని పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఈసీఐ.. ఈనెల 24తో ముగియాల్సిన గడువును ఆగస్టు 3

➤ మిగతా 2వ పేజిలో..

# ఫ్యూచర్ సిటీలో అమెజాన్ కీలకం

**మొదటిపేజీ తరువాయి..** ప్రస్తుతమున్న 5 శాతం నుంచి 10 శాతానికి పెంచడమే తమ లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'తెలంగాణ రైజింగ్-2047' విజన్‌లో భాగంగా 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనే భారీ లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఐఎస్‌బీ, నల్సార్ వంటి అత్యున్నత విద్యాసంస్థలతో కలిసి పని చేస్తున్నామని, పారిశ్రామికవేత్తలకు మెరుగైన ప్రోత్సాహకాలు అందిస్తున్నామని వివరించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ఔటర్ రింగ్ రోడ్డు (ా==), అంతర్జాతీయ విమానాశ్రయం, ఇక్కడి ఫార్మా రంగాలు ఎంతో దోహదపడ్డాయని చెబుతూ.. రాష్ట్రాన్ని క్యూర్ (జఖ=జు), ప్యూర్ (ాఖ=జు), రేర్ జోన్లుగా విభజించి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు.

హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు నగర పరిధిలోని ఫార్మా సహా ఇతర పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. రవాణా రంగంలో విప్లవాత్మక మార్పుల కోసం నగరంలో తిరిగే 3 లక్షల ఆర్టీసీ బస్సులతో పాటు 2 లక్షల డీజిల్ ఆటోలను విద్యుత్ (ఈవీ) వాహనాలుగా మార్చేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. ఈవీ వాహనాల రిజిస్ట్రేషన్ ఫీజుపై 'జీరో ట్యాక్స్' విధానాన్ని అమలు చేయడం వల్ల ప్రభుత్వానికి ఏటా రూ.1,500 కోట్ల ఆదాయం తగ్గినప్పటికీ పర్యావరణ హితం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అలాగే మూసీ నది ప్రక్షాళన, మెట్రో విస్తరణ పనులను వేగవంతం చేశామని వివరించారు.

కాగా, రాబోయే 12 ఏళ్ల కాలంలో తెలంగాణలో అమెజాన్ సంస్థ రూ.60,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టేలా రాష్ట్ర ప్రభుత్వంతో ఇప్పటికే ఒప్పందం కుదిరింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కోసం ప్రభుత్వం ఫ్యూచర్ సిటీలో 202 ఎకరాలు, చందన్‌వెల్లిలో మరో 98 ఎకరాల భూమిని కేటాయించడంతో పాటు రూ.125 కోట్ల విలువైన ప్రోత్సాహకాలు, రాయితీలను కల్పించింది. ఈ మెగా డేటా సెంటర్ నిర్మాణంలో మొదటి దశ పనులు రాబోయే 24 నెలల్లో పూర్తి కానుండగా, మిగిలిన దశలను తదుపరి పదేళ్లలో పూర్తి చేయనున్నారు. హైదరాబాద్‌లో క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×), డిజిటల్ బ్యాంకింగ్, ఈ-కామర్స్, వైద్య సేవల రంగాల అభివృద్ధికి ఈ డేటా సెంటర్ ఒక డిజిటల్ వెన్నెముకగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంత్రులు జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు రామకృష్ణా రావు సహా అమెజాన్ ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ డిశ్చార్జ్

**మొదటిపేజీ తరువాయి..** ఎట్టకేలకు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ లభించిందని, తమ హృదయాలు కృతజ్ఞతతో నిండిపోయాయని అన్నా లెజినోవా పేర్కొన్నారు. తన భర్త ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, ఎంతో నైపుణ్యం, బాధ్యతతో ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన వైద్య బృందానికి ఆమె హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఆయన సురక్షితమైన చేతుల్లో ఉన్నారనే నమ్మకం తమ కుటుంబానికి ఎంతో విలువైన ప్రశాంతతను ఇచ్చిందని చెబుతూ.. చికిత్స అందించిన డాక్టర్లకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. కేవలం వైద్య నైపుణ్యానికే కాకుండా, ఈ కష్ట సమయంలో వారు చూపించిన దయ, అంకితభావం మరియు మానవత్వానికి తాము ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ సర్జరీ విషయానికి వస్తే.. ఆయన గత 2016 నుంచి భుజం నొప్పితో బాధపడుతున్నారు. ప్రజా క్షేత్రంలో నిరంతర పర్యటనలు, వారాహి యాత్రలు మరియు ఎన్నికల ప్రచారాల సమయంలో అభిమానులు ఆయన్ని లాగడం వల్ల కుడి భుజంలోని రొటేటర్ కఫ్ కండరాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీనికి తోడు చిన్న ఫ్రాక్చర్ కూడా ఉండటంతో ప్రముఖ క్రీడా వైద్య నిపుణుడు డాక్టర్ దిన్షా పార్థీవాలా నేతృత్వంలోని బృందం సుమారు మూడున్నర గంటల పాటు శస్త్రచికిత్స నిర్వహించింది. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ కోలుకుంటుండగా, వైద్యులు ఆయనకు 3 వారాల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని, నిరంతర పర్యవేక్షణలో ఉండాలని సూచించారు. దీంతో జనసైనికులు, అభిమానులు ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.

# నదులు అనుసంధానం చేయాలి

**మొదటిపేజీ తరువాయి. .** టీఎంసీల నీటిని తరలించగలిగామని, దీనివల్ల రాయలసీమకు కూడా శ్రీశైలం ద్వారా నీటిని పొదుపు చేసి తరలించే అవకాశం ఏర్పడిందని తెలిపారు. నీరు సమృద్ధిగా ఉంటేనే పారిశ్రామికీకరణ, తద్వారా ప్రాంతీయ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

ప్రముఖ ఇంజినీరింగ్ దిగ్గజం డాక్టర్ కె.ఎల్. రావు 124వ జయంతిని పురస్కరించుకుని చంద్రబాబు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్, హీరాకుడ్, కోసి వంటి ప్రతిష్టాత్మక డ్యామ్‌ల రూపకల్పనలో కె.ఎల్. రావు పోషించిన పాత్రను కొనియాడారు. ముగ్గురు ప్రధానమంత్రుల హయాంలో కేంద్రమంత్రిగా పనిచేసి అంతర్జాతీయ స్థాయిలో నీటి నిపుణుడిగా ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ధవళేశ్వరం, ప్రకాశం బ్యారేజీలను కె.ఎల్. రావు ఆధునికీకరించి రాష్ట్రాన్ని అన్నపూర్ణగా నిలిపారని శ్లాఘించారు. ఆయన తర్వాత ఎన్టీఆర్ సాగునీటి రంగాన్ని మరింత బలోపేతం చేశారన్నారు. ప్రస్తుతం తగ్గిపోతున్న భూగర్భ జలాలను పెంచడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, ఇందులో భాగంగానే గడిచిన రెండేళ్ల కాలంలో ప్రాజెక్టుల కోసం రూ.24 వేల కోట్లు ఖర్చు చేశామని వివరించారు.

హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దినట్లే, నవ్యాంధ్ర రాజధాని అమరావతిని కూడా ఒక అద్భుత నగరంగా నిర్మిస్తున్నామని సీఎం తెలిపారు. కేవలం కొందరు స్వార్థ రాజకీయాల కోసం రైతులను రెచ్చగొట్టి అమరావతి నిర్మాణాన్ని, సీడ్ యాక్సెస్ రోడ్డు పనులను అడ్డుకోవాలని చూశారని విమర్శించారు. అయితే, 99 శాతం మంది రైతులు స్వచ్ఛందంగా భూములిచ్చి రాజధాని నిర్మాణంలో భాగస్వాములయ్యారని, ఆగస్టు 15 నాటికి సీడ్ యాక్సెస్ రోడ్డు పనులు పూర్తవుతాయని స్పష్టం చేశారు. ఈ రోడ్డుపై ప్రయాణిస్తే అమరావతి ప్రాముఖ్యత ఏంటో ప్రతి ఒక్కరికీ అర్థమవుతుందన్నారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# తెలంగాణాలో సర్ పొడగింపు

**మొదటిపేజీ తరువాయి..** వరకు పొడిగిస్తూ సవరించిన నూతన షెడ్యూల్‌ను విడుదల చేసింది. అక్టోబర్ 1వ తేదీని అర్హత గడువుగా నిర్దేశిస్తూ ఈ సవరణలు చేశారు.

నూతన షెడ్యూల్ ప్రకారం.. జూన్ 25న బూత్ స్థాయి అధికారులు ప్రారంభించిన ఇంటింటి సర్వే ప్రక్రియ ఇకపై ఆగస్టు 3వ తేదీ వరకు కొనసాగనుంది. అలాగే పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ పనులను కూడా అధికారులు ఆగస్టు 3 లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. అనంతరం, ఆగస్టు 10న రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల ముసాయిదా జాబితాను అధికారికంగా విడుదల చేస్తారు. ముసాయిదా జాబితా విడుదలైన తర్వాత కొత్త ఓటు నమోదుకు, తప్పుల సవరణలకు సంబంధించి అభ్యంతరాల స్వీకరణ కోసం ఒక నెల రోజుల పాటు సమయం ఇచ్చారు. ప్రజలు ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 9 వరకు తమ దరఖాస్తులను సమర్పించవచ్చు.

ఈ దరఖాస్తులపై విచారణ జరిపి, అభ్యంతరాలను పరిష్కరించే ప్రక్రియను అధికారులు ఆగస్టు 10 నుంచి అక్టోబర్ 8 లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ ప్రక్రియ అంతా ముగిసిన తర్వాత, తుది ఓటర్ల సవరించిన జాబితాను అక్టోబర్ 12న అధికారికంగా విడుదల చేయనున్నారు.

## బోనాల ఉత్సవాలు రాష్ట్రానికే ప్రత్యేకమైన శక్తి ఆరాధనా పండుగ

తెలంగాణ ఆత్మను, సంస్కృతిని, సంప్రదాయాలను ప్రతిబింబించే ఆషాఢ బోనాల ఉత్సవాలు రాష్ట్రానికే ప్రత్యేకమైన శక్తి ఆరాధనా పండుగ అని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆమె రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల జీవన విధానానికి, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదని, అది తెలంగాణ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే మహోత్సవమని ఆమె కొనియాడారు.

జూలై 16 నుంచి ప్రారంభమయ్యే ఈ బోనాల ఉత్సవాలను దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని సుమారు 3 వేలకు పైగా దేవాలయాల్లో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని మంత్రి వెల్లడించారు. జంట నగరాల్లో జరిగే ఈ ఉత్సవాలు తెలంగాణ గంగా-జమున తహజీబ్ (సారూప్య సంస్కృతి) సంస్కృతికి నిదర్శనంగా నిలుస్తూ, లౌకిక స్ఫూర్తిని చాటుతాయని ఆమె పేర్కొన్నారు. ఈ ఏడాది ఆషాఢ బోనాలు గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారికి సమర్పించే తొలి బోనంతో ప్రారంభమై, ఆగస్టు 13న హరిబౌలిలోని

# విమాన ప్రమాద దర్యాప్తు తుది దశకు

**మొదటిపేజీ తరువాయి..** ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ విమానం కుప్పకూలిన దుర్ఘటనలో ప్రయాణికులు, సిబ్బందితో పాటు భూమిపై ఉన్నవారితో కలిపి మొత్తం 260 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదానికి సంబంధించి విమాన రికార్డులు, బ్లాక్ బాక్స్ డేటా, ఇంజిన్ భాగాల విశ్లేషణలో దర్యాప్తు సంస్థ కీలక పురోగతి సాధించింది.

మరోవైపు, బాధితుల కుటుంబ సభ్యులు ఐదు ప్రధాన డిమాండ్లతో పౌర విమానయాన శాఖకు లేఖ రాశారు. తుది నివేదికను ఖరారు చేసే ముందు స్వతంత్రంగా 'ఫుల్ ఫ్లైట్ సిమ్యులేటర్ వాలిడేషన్ టెస్టులు' నిర్వహించాలని, అలాగే విచారణ బృందంలో బోయింగ్ 787 విమానాలను నడిపిన అనుభవం ఉన్న సీనియర్ కమర్షియల్ పైలట్‌ను చేర్చాలని వారు కోరారు. దర్యాప్తు పురోగతి వివరాలను ప్రతి 15 లేదా 30 రోజులకు ఒకసారి తమకు అధికారికంగా తెలియజేయాలని, తుది నివేదిక విడుదలకు ఒక నిర్దిష్ట గడువును ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో చట్టపరమైన హక్కులను కోల్పోయేలా బాధితుల కుటుంబాలతో ఎలాంటి బలవంతపు ఒప్పందాలు చేసుకోకూడదని కోరారు.

బాధితుల కుటుంబాల లేఖపై సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు.. విచారణ పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు కుటుంబ సభ్యులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, బాధితుల హక్కులకు భంగం కలిగేలా ఎలాంటి ముందస్తు ఒప్పందాలపై సంతకాలు చేయించవద్దని స్పష్టం చేశారు. అంతర్జాతీయ దర్యాప్తు ప్రమాణాల ప్రకారమే విచారణ పారదర్శకంగా, వేగంగా సాగుతోందని మంత్రి పునరుద్ఘాటించారు.

## వాహనానికి చార్జింగ్ పెడుతుండగా షాక్

**మొదటిపేజీ తరువాయి..** ఉంచిన పెట్రోల్ వాహనాలకు కూడా వ్యాపించడంతో ప్రమాద తీవ్రత ఒక్కసారిగా పెరిగిపోయింది. చూస్తుండగానే దట్టమైన పొగలు, మంటలు భవనం మొత్తాన్ని కమ్మేయడంతో లోపల ఉన్న ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు రంగంలోకి దిగారు. హైడ్రాలిక్ ఫ్లాట్‌ఫారమ్‌లు, ప్రత్యేక రెస్క్యూ వాహనాల సహాయంతో సహాయక చర్యలు ముమ్మరం చేశారు. భవనం పై అంతస్తుల్లో చిక్కుకుపోయిన సుమారు 50 కుటుంబాలను అగ్నిమాపక సిబ్బంది చాకచక్యంగా రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అయితే, ప్రమాదం వల్ల వెలువడిన దట్టమైన విషపూరిత పొగను పీల్చడంతో ఇద్దరు వ్యక్తులు ఊపిరాడక స్పృహతప్పి పడిపోయారు. వారిని వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే వారు మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. అగ్నిమాపక సిబ్బంది సాహసోపేతంగా ప్రజలను రక్షించిన వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా షేర్ అవుతున్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. నిర్లక్ష్యానికి కారణమైన భవన యజమానితో పాటు లీజుదారుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# చట్టవిరుద్ధంగా పోడు చేస్తే చర్యలు తప్పవు

## అటవీ అధికారి హెచ్చరిక

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై15 :** అటవీ హక్కుల చట్టం ప్రకారం చెల్లుబాటయ్యే అటవీ హక్కు పత్రాలు లేకుండా భూముల్లో పోడు సాగు చేయవద్దని, దుక్కులు దున్ని పంటలు వేయొద్దని ముసలిమడుగు సెక్షన్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ అనార్కలి అన్నారు. బుధవారం బూర్గంపహాడ్ మండల పరిధిలోని బుడ్డగూడెం గ్రామంలోని ఆదివాసీలకు అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, పోడు సాగుపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. చట్ట విరుద్ధంగా అడవులను నరికి ప్రభుత్వ ప్లాంటేషన్లు ధ్వంసం చేసి పోడు సాగు చేస్తే అటవీ చట్టాలు, ఇతర సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్తగా అడవులను ఆక్రమించి పోడు భూములు సృష్టించవద్దని, అడవులకు నిప్పు పెట్టకూడదని, వన్యప్రాణులను వేటాడరాదని, అటవీ సంపదను భావితరాలకు పరిరక్షించడం ప్రతిఒక్కరి బాధ్యత అని వివరించారు. అటవీ పరిరక్షణలో గ్రామస్తులు అటవీశాఖ సిబ్బందికి సహకరించాలని, ఎలాంటి అక్రమాలు అడవుల్లో జరిగినా అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సదస్సులో సోంపల్లి మాజీ సర్పంచ్ తాటి వీరాంజనేయులు, కార్యదర్శి వెంకటేశ్వర్లు, బీట్ ఆఫీసర్లు సోడె శ్రీరాములు, మడకం వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణ, బ్రిడ్జ్ కట్టడాలపై అధికార పక్షాల అవగాహన రాహిత్యం

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 15: (జన సంఘర్షణ)

గత కొన్ని రోజులుగా రామాయంపేటలోని నేషనల్ 44 రహదారిలో విపరీతంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని గత కొన్ని రోజులుగా ప్రియతమ నాయకురాలు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి మరి ఆ ప్రదేశానికి వెళ్లి అండర్ పాస్, బ్రిడ్జ్ నిర్మాణానికై ప్రజాభిప్రాయ సేకరణను తీసుకోవడం జరిగింది. తదుపరి కొంత సమయం తర్వాత కలెక్టర్ వద్దకు వెళ్లి పరిస్థితులపై కలెక్టర్‌కి వివరిస్తూ తెలియజేయడం జరిగింది. దాని తర్వాత ఎటువంటి స్పందన ప్రభుత్వాల నుంచి గాని అధికారుల నుంచి గాని లేకపోవడంతో, ఎన్‌హెచ్‌ఏఐ రాష్ట్ర అధికారి శివశంకర్‌ని కలిసి ఇక్కడున్నటువంటి పరిస్థితులపై అధికారులకు వివరంగా తెలియజేయడంతో వారు సానుకూలంగా స్పందించి కోమటిపల్లి నుండి కెసిఆర్ నగర్ వరకు బ్రిడ్జ్ నిర్మాణం చేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది లేకుంటే ప్రమాదాలు తీవ్రతరం అవుతాయి అని మాజీ డిప్యూటీ స్పీకర్ బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి వాళ్లకి వివరించడం జరిగింది. ఇట్టి విషయంపై నిన్నటి రోజున బిజెపి నాయకులు అవగాహన రాహిత్యంగా ప్రెస్ మీట్ పెట్టి అడ్డగోలు మాటలు చెప్పడం జరుగుతోంది. వారు పది సంవత్సరాలు బిఆర్ఎస్ పాలనలో బ్రిడ్జ్ నిర్మాణాన్ని అడ్డుకున్నది ఎమ్మెల్యే అని తెలియజేయడం జరుగుతోంది. ఈ విషయంపై కొంత అవగాహనతో మాట్లాడదలచుకుంటే రోడ్డు బ్రిడ్జ్ కట్టడాలు కానివ్వండి విస్తరణ కానివ్వండి, దీనికి అధికారం నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాకు లేకుంటే మినిస్ట్రీ ఆఫ్ రోడ్స్ ట్రాన్స్పోర్ట్ అండ్ హైవేస్ కు మాత్రమే చెందినదిగా మరి బిజెపి నాయకులకు మేము తెలియజేస్తున్నాము. ఒక ఎంపీ స్థానంలోనూ ఎమ్మెల్యే స్థానంలో ఉంటే వారికి ఎటువంటి విస్తారణకైనా బ్రిడ్జిల నిర్మాణాకైనా మద్దతు పలికే అధికారం మాత్రమే ఉంటుంది. దీని నిర్మించే లేదు తొలగించే అధికారం కేవలం ఎన్ హెచ్ ఎఐ అధికార యంత్రాంగానికి మాత్రమే ఉంటుందని స్పష్టంగా తెలియజేస్తున్నాం. మరి ఇట్టి విషయం పాపం వారికి తెలవకుండా అవగాహన రాహిత్యంగా మాట్లాడటం నిజంగా దురదృష్టకరం మరి మీరు చెప్పినట్టుగా ఒకవేళ బిఆర్ఎస్ ప్రభుత్వమే ఆ బ్రిడ్జ్‌ను ఆపింది అనడానికి రుజువులు ఏమైనా ఉన్నాయా లేదా బిజెపి కూడా




10 ఏళ్ల నుంచి అధికారంలో ఉన్నది మరి వారు ఇక్కడ బ్రిడ్జి నిర్మించాల్సిందిగా ఏదైనా జీవో పాస్ చేసినట్టు ఆధారాలు ఉన్నాయా లేదా బిఆర్ఎస్ ప్రభుత్వం ఆపుతున్నట్టు ఏమన్నా ఆధారాలు ఉన్నాయా ఆధారాలు చూపించకుండా గాలి మాటలు మాట్లాడి గాలి ఆరోపణలు చేసి కుంటు రాజకీయాలు చేస్తున్నటువంటి బిజెపి పార్టీని ప్రజలు గమనిస్తున్నారు. వీరి కల్లిబల్లి మాటలు అబద్ధాలు, విష ప్రచారాలు ప్రజలు నమ్మే పరిస్థితులు లేరు. పద్మా దేవేందర్ రెడ్డి చొరవతో బ్రిడ్జి తొందర్లో నిర్మాణం అవుతుంది. ఆ నిర్మాణాన్ని కూడా ప్రజలు ఘనంగా స్వాగతిస్తున్నారు అని చెప్పి ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

# రామాయంపేటలో మూడు బూతుల్లో 100 శాతం ఎన్యుమరేషన్ పూర్తి

- అందరికీ బీజేపీ ఎస్ఐఆర్ జిల్లా కన్వీనర్ రాగి రాములు, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అభినందనలు తెలిపారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 15 (జన సంఘర్షణ)

మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ, రామాయంపేట మండల పరిధిలో ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఎన్యుమరేషన్ ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని బూత్ నెం.76, బూత్ నెం.90, అలాగే రామాయంపేట మండలంలోని రాయలాపూర్ గ్రామం బూత్ నెం.114లో 100 శాతం ఎన్యుమరేషన్ నమోదు పూర్తయింది. అలాగే రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీలో 90 శాతం ఎన్యుమరేషన్ పూర్తి కావడం విశేషం. మెదక్ జిల్లాలోనే తొలిసారిగా మూడు బూతుల్లో 100 శాతం ఎన్యుమరేషన్ పూర్తి కావడం అభినందనీయమని భారతీయ జనతా



పార్టీ ఎస్ఐఆర్ జిల్లా కన్వీనర్ రాగి రాములు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 100 శాతం ఎన్యుమరేషన్ పూర్తి చేసిన బీఎల్ఓలకు, భారతీయ జనతా పార్టీ బీఎల్ఏ-2లకు, కృషి చేసిన మున్సిపాలిటీ సిబ్బందికి, పాలకవర్గానికి, రాయలాపూర్ గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు, కార్యక్రమంలో పాల్గొన్న భారతీయ జనతా పార్టీ రామాయంపేట పట్టణ శాఖ, రామాయంపేట మండల శాఖ నాయకులు, కార్యకర్తలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎమ్మార్వో, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐలు, వారి సిబ్బంది ఈ కార్యక్రమాన్ని సవాలుగా తీసుకొని రామాయంపేట మండలం, రామాయంపేట మున్సిపాలిటీలో 100 శాతం ఎన్యుమరేషన్ పూర్తి చేయడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. మిగిలిన అన్ని బూతుల్లో కూడా రానున్న రెండు మూడు రోజుల్లో ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది, బీఎల్ఓలతో సమన్వయం చేసుకొని ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తిచేసేందుకు భారతీయ జనతా పార్టీ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని రాగి రాములు తెలిపారు. మెదక్ జిల్లాలోనే తొలిసారిగా మూడు బూతుల్లో 100 శాతం ఎన్యుమరేషన్ పూర్తి కావడం రామాయంపేటకు గర్వకారణమని పేర్కొంటూ, ఈ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ తన వ్యక్తిగతంగా, అలాగే భారతీయ జనతా పార్టీ తరఫున హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు.

# జిల్లాలో క్రీడా స్ఫూర్తి ప్రతిభంభించేలా క్రీడా పోటీలు నిర్వహణ

- ఎస్ జి ఎఫ్ వెబ్సైట్ పోర్టల్ ఆవిష్కరణ.
- సెప్టెంబర్ మొదటి వారంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు.
- వ్యాయామ ఉపాధ్యాయులు సమన్వయంతో విజయవంతంగా క్రీడా పోటీలు నిర్వహణ.
- జిల్లా ఆదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 15: (జన సంఘర్షణ)



జిల్లాలో క్రీడా స్ఫూర్తి ప్రతిభంభించేలా సెప్టెంబర్ మొదటి వారంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహణకు వ్యాయామ ఉపాధ్యాయుల సమన్వయం చాలా అవసరమని అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. జిల్లా విద్యాధికారి అధ్యక్షతన బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాలోని పీడీలు, పీఈటీలతో సమన్వయ కమిటీ సమావేశానికి జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, ఏ ఎం ఓ సుదర్శన్ మూర్తి సంబంధిత పీడీలు, పీఈటీల తో అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ..ఆగస్టు 25వ తేదీలోపు మండల స్థాయి క్రీడా పోటీలను పూర్తి చేయాలని, అనంతరం సెప్టెంబర్ మొదటి వారం నుంచి జిల్లా స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. పోటీల నిర్వహణలో నాణ్యత, సమయపాలనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసిపకడ్బందీగా క్రీడా పోటీలను నిర్వహించాలని అధికారులకు సూచించారు. అలాగే, రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు డ్రెస్సులు అందించే విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎస్ జి ఎఫ్ వెబ్సైట్ పోర్టల్ ను ఆవిష్కరించారు. ఈ ఆన్లైన్ వెబ్ పోర్టల్ లో క్రీడాకారులకు సంబంధించిన కీలక సమాచారాలతో పాటు గతంలో మెదక్ జిల్లా నుండి ప్రతిభావంతులైన క్రీడాకారుల వివరాలు జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, పథకాలకు సంబంధించిన సమగ్ర సమాచారం లభ్యమవుతుందన్నారు. క్రీడాకారులు వారికి నైపుణ్యం గల పాటలలో




ప్రతిభ కనబరచడానికి ఈ పోర్టల్ ఒక వేదికగా నిలుస్తుందన్నారు. అంతకుముందు జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్ జి ఎఫ్) కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్. నాగరాజు మాట్లాడుతూ.. గత విద్యా సంవత్సరంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలలో 4,150 మంది బాలబాలికలు వివిధ క్రీడాంశాలలో పాల్గొన్నారని తెలిపారు. వారిలో 192 మంది రాష్ట్రస్థాయికి, 16 మంది జాతీయస్థాయికి ఎంపికై జిల్లాకు గుర్తింపు తీసుకొచ్చారని వివరించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి, పీటీల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నాగరాజు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి మధు, శ్రీధర్ రెడ్డి మాధవరెడ్డి, శ్యామ్, రూపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆకస్మికంగా రామాయంపేట సిహెచ్‌సి హాస్పిటల్‌ని సందర్శించిన మెదక్ జిల్లా కలెక్టర్

- ఆస్పత్రిలో వైద్య పరికరాలు, ఆస్పత్రి పనితీరును అడిగి తెలుసుకున్నారు.
- ఆసుపత్రికి స్పెషల్ ఆఫీసర్ సురేష్ హాజరయ్యారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 15: (జన సంఘర్షణ)

మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలోని ప్రభుత్వ సిహెచ్ సి ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ సందర్శించి ఆసుపత్రిలో పరికరాలు, ప్రజలకు వైద్యం ఎలా చేస్తున్నారు అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి స్పెషల్ ఆఫీసర్ సురేష్ పాల్గొన్నారు. ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్. లింబాద్రి, ఆసుపత్రి సిబ్బంది తతలు పాల్గొన్నారు.





# పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి

- నీలం మధు ముదిరాజ్
- లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన నీలం.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 15 (జన సంఘర్షణ)





ఆపత్కాలంలో పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక సంజీవనిలా మారిందని, నిరుపేదల ఆరోగ్య భద్రతకు ఈ నిధి ఎంతో భరోసానిస్తోందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం ఆయన అమీన్ పూర్ డివిజన్ అనసుజ(60,000/-), గుమ్మడిదల సీహెచ్ శ్రీనివాస్(47,500/-), ఇస్నాపూర్ మున్సిపాలిటీ చిట్కుల్ సంగన్నగారి మహేష్(60,000/-) చొప్పున లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎన్ ఎం ఆర్ క్యాంప్ కార్యాలయంలో స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ.. ఆర్థిక స్థోమత లేక కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి కొండంత అండగా నిలుస్తోందని కొనియాడారు. సమయానికి వైద్యం అందక, అప్పుల పాలవుతున్న ఎన్నో కుటుంబాలను ప్రభుత్వం ఈ నిధి ద్వారా ఆదుకుంటోందని, నిరుపేదలు అనారోగ్యం బారిన పడినప్పుడు అధైర్యపడకుండా ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలనేదే తమ సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతూ సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న బాధితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా నిధులు మంజూరయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ సర్పంచ్‌లు

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 15 (జన సంఘర్షణ)





మెదక్ జిల్లా హవేలీఘనపూర్ మండలానికి చెందిన బీఆర్ఎస్ సర్పంచ్‌లు బుధవారం హైదరాబాద్‌లోని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హవేలీఘనపూర్ సర్పంచ్ మేకల సాయిలు, కొత్తపల్లి సర్పంచ్ నర్ల సాయిలు, సుల్తాన్‌పూర్ సర్పంచ్ కాట్రోత్ రమేష్, సర్దన సర్పంచ్ వినోద్ సతీష్, గంగాపూర్ సర్పంచ్ లావణ్య యాదగౌడ్‌తో పాటు మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ సర్పంచ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. పార్టీ శ్రేణులు గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. గ్రామాభివృద్ధితో పాటు పార్టీ బలోపేతానికి సర్పంచ్‌లు సమన్వయంతో పనిచేయాలని కోరారు. మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలతో నిరంతరం మమేకమై పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

- బిజెపి రామాయంపేట పట్టణ అధ్యక్షుడు శీలం అవినాష్ రెడ్డి తెలిపారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 15 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ కోమటిపల్లి రెండో వార్డుకు సంబంధించి రొయ్యల బాబు తండ్రి సిద్ధరాములుకి మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేయడం జరిగింది. పేద, బడుగు,బలహీన వర్గాల ప్రజలను అత్యవసర సేవలకు ఆదుకునేందుకు రఘునందన్ రావు కృషి చేస్తున్నారని పట్టణ అధ్యక్షుడు శీలం అవినాష్ రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతల శేఖర్, మాజీ పట్టణ అధ్యక్షుడు దమ్మయ్యగారి భానుచందర్, రొయ్యల స్వామి, కొక్కు బాబు, రొయ్యల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంఠారెడ్డి తిరుపతి రెడ్డి

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 15 (జన సంఘర్షణ)



రామాయంపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఆర్ ఎం పి డాక్టర్ కృష్ణ మరణించడం జరిగింది. ఈ విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ మెదక్ నియోజకవర్గ ఇంచార్జ్ కంఠారెడ్డి తిరుపతి రెడ్డి వారి కుటుంబానికి 5,000- రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు వార్డ్ మెంబర్ సునీల్ స్వామి జగదీష్ తిరుపతి బాబు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం తెలుగు దినపత్రిక
గురువారం
16 జులై 2026

# గ్రామాలలో సర్పంచ్‌లు ప్రజలకు అందుబాటులో వుండాలి

❑ **మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి సర్పంచ్ లకు సూచించారు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 15 (జన సంఘర్షణ)

మెదక్ జిల్లా హవెలి ఘనపూర్ మండలములోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండలని వారికి సూచించారు. బుధవారం హవెలి ఘనపూర్ సర్పంచ్‌లు మాజీ హైదరాబాద్‌లో డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి కలసి మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును మర్యాద పూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ సర్పంచ్‌లు. హవేలీఘనపూర్ మండలానికి చెందిన బీఆర్ఎస్



సర్పంచ్‌లు బుధవారం హైదరాబాద్‌లోని మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ను కలిశారు. ఘనపూర్ సర్పంచ్ మేకల సాయిలు, కొత్తపల్లి సర్పంచ్ నర్లసాయిలు, సుల్తాన్‌పూర్ సర్పంచ్ కాట్రోత్ రమేష్, సర్దన సర్పంచ్ వినోద్ సతీష్, గంగాపూర్ సర్పంచ్ లావణ్య యాదగౌడ్‌తో పాటు మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ సర్పంచ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ పార్టీ శ్రేణులు గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. గ్రామాభివృద్ధితో పాటు పార్టీ బలోపేతనికి సర్పంచ్‌లు సమన్వయంతో పనిచేయాలని కోరారు. మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలతో నిరంతరం పార్టీకార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు.

# ఎస్సీ, ఎస్టీ ప్రొఫెసర్లపై పీవీఎన్ఆర్ టీవీ వర్సిటీ అధికారుల వేధింపులు

❑ **సంబంధంలేని కేసుల్లో ఇరికించే కుట్ర.**
❑ **కోర్టు ఉత్తర్వులను సైతం అమలు చేయని వైనం.**
❑ **ప్రశ్నించే గొంతులను తొక్కివేస్తూ మారుమూలకు బదిలీ.**
❑ **మీడియా సమావేశంలో డాక్టర్ ఆర్.ఎస్. ప్రసన్న కుమార్ ఆవేదన, ఆగ్రహం.**

హైదరాబాద్ సిటీ ప్రతినిధి అంజిబాబు, జూలై 15 (జన సంఘర్షణ):

ఎస్సీ, ఎస్టీ ప్రొఫెసర్లపై హైదరాబాద్ రాజేంద్రనగర్ లోని పి.వి.ఎన్.ఆర్. తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ అధికారులు వేధింపులకు పాల్పడుతున్నారని ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.ఎస్. ప్రసన్న కుమార్ (ప్రస్తుతం వి.ఆర్.ఎస్ తీసుకున్నారు) ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరి వ్యక్తుల ప్రోత్సాహబలంతో సంబంధం లేని కేసుల్లో ఇరికించే కుట్రలు పన్నుతున్నారని వాపోయారు. హైదరాబాద్ లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అక్రమ మార్గంలో నియమించిన ఇన్చార్జ్ అధికారులను వెంటనే తొలగించి, సీనియారిటీ ప్రకారం అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ అధికారులు కోర్టు ఉత్తర్వులను సైతం ఉల్లంఘించడం శోచనీయమన్నారు.

**అక్రమాలపై ప్రశ్నిస్తే బదిలీలు:**

షెడ్యూల్డ్ కులం (మాదిగ)కు చెందిన తనపైనా, షెడ్యూల్డ్ తెగ (లంబాడ)కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఆక్వాకల్చర్ ఎక్స్‌టెన్షన్ - ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నవారు) లపైన, ప్రస్తుతం విధుల్లో ఉన్న మరో ప్రొఫెసర్‌పైన ఉద్దేశపూర్వక, నిరాధారమైన, చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జ్ఞాన ప్రకాష్, రిజిస్ట్రార్ డాక్టర్ శరత్ చంద్ర, డీన్ ఆఫ్ ఫ్యాకల్టీ డాక్టర్ బి. ఉదయ్ కుమార్, పరిశోధనా విభాగం డైరెక్టర్ డాక్టర్ సిహెచ్. హరి కృష్ణ, ప్రొఫెసర్ డాక్టర్ రామ్ సింగ్, డాక్టర్ ఇ. సునీల్ ఆనంద్, నాన్-టీచింగ్ యూనియన్ అధ్యక్షుడు షర్ఫుద్దీన్ కలిసి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఇటీవల తిరిగి విధుల్లోకి చేరిన




ప్రొఫెసర్ డాక్టర్ కె. వెంకట రమణ (వెటర్నరీ గైనకాలజీ అబ్‌స్ట్రెట్రిక్స్ విభాగం) పై ఉద్దేశపూర్వక,నిరాధారమైన, చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడుతున్నారు. అక్రమాలపై ప్రశ్నించినందుకు జగిత్యాల జిల్లా కోరుట్ల (సీ. వి. ఎస్సీ ) లోని మారుమూల ప్రాంతానికి బదిలీ చేశారని తెలిపారు.

**రిజిస్ట్రార్ కీలక పాత్ర:**

తనను వేధించడంలో రిజిస్ట్రార్ డాక్టర్ శరత్ చంద్ర కీలక పాత్ర పోషించారని డాక్టర్ ఆర్.ఎస్. ప్రసన్న కుమార్ ఆరోపించారు. ప్రొఫెసర్ సేవలందించిన తనపై మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ కె. కొండల్ రెడ్డి, డీన్ ఆఫ్ ఫ్యాకల్టీ డాక్టర్ వి. లు కుట్ర పన్నుతున్నారని, రవీందర్ రెడ్డి కారణంగానే, 2017-2018లో నేను వరంగల్ జిల్లా మమ్నూర్ కె.వి.కె లో ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నప్పుడు తన ప్రొబేషన్ మరియు పదోన్నతి (ప్రమోషన్ ) నిలిపివేయబడ్డాయన్నారు. తన వల్లే తాను ఆయనకు జూనియర్‌గా మిగిలిపోయానన్నారు. వీరు (పి.వి.ఎన్.ఆర్. టీ.వీ.యు) లోని 'లైవ్‌స్టాక్ ప్రొడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్' విభాగంలోనే పనిచేస్తున్నారు. ప్రస్తుతం తాను కాంగ్రెస్ కార్యకర్తగా ఉన్నానని, మాజీ ఐపీఎస్ అధికారి, ప్రస్తుతం బి. ఆర్ .ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ సోదరుడినని వెల్లడించారు.

**చట్టవిరుద్ధం.. ఏకపక్ష చర్య:**

పి.వి.ఎన్.ఆర్. టీ.వీ.యు మాజీ వైస్-ఛాన్సలర్ మరియు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి బావమరిది అయిన డాక్టర్ రవీందర్ రెడ్డి, రిజిస్ట్రార్‌గా ఉన్న సమయంలో 2022లో పెబ్రేరులోని సి.ఎఫ్.ఎస్.సి (కాలేజ్ ఆఫ్ ఫిషరీ సైన్స్) అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఆక్వాకల్చర్ ఎక్స్‌టెన్షన్) డాక్టర్ బాలాజీ గుగులోతును ఉద్దేశపూర్వకంగా సస్పెండ్ చేశారు. గౌరవనీయులైన హైకోర్టు తీర్పు వచ్చినప్పటికీ ఆయనను తిరిగి విధుల్లోకి తీసుకోలేదని, ఇది చట్టవిరుద్ధం, ఏకపక్ష చర్య అని ఆధారాలో సహా ప్రసన్నకుమార్ వివరించారు. ఈ సమావేశంలో ప్రజా నాయకుడు సామాజికవేత్త క్రాంతికుమార్, ఎమ్మార్పీఎస్ స్టేట్ నాయకుడు బోయ రమణ, ఎమ్మార్పీఎస్ లీడర్ రమేష్ ,దళిత మహిళ లీడర్ నికిత, ఓయూ లీడర్ అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.

# కంఠరెడ్డి తిరుపతి రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ సర్పంచ్‌లు..

❑ **పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపు.**



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 15:(జన సంఘర్షణ)

హవేలీఘనపూర్ మండలానికి చెందిన బీఆర్ఎస్ సర్పంచ్‌లు బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర నాయకుడు కంఠరెడ్డి తిరుపతి రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాణిక్యరెడ్డి, హవేలీఘనపూర్ సర్పంచ్ మేకల సాయిలు, కొత్తపల్లి సర్పంచ్ నర్ల సాయిలు, సుల్తాన్‌పూర్ సర్పంచ్ కాట్రోత్ రమేష్‌తో పాటు నాయకులు సతీష్, యాదగౌడ్, మండలానికి చెందిన ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంఠరెడ్డి తిరుపతి రెడ్డి మాట్లాడుతూ..పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, ప్రజాప్రతినిధి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, బీఆర్ఎస్ శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మండలంలో పార్టీ సంస్థాగత బలోపేతం, రానున్న కార్యక్రమాల నిర్వహణ, రాజకీయ పరిస్థితులపై నాయకులతో చర్చించినట్లు తెలిపారు.

# రజక సంఘం బేడ రెండు లోని సుమారు 100 మంది కాంగ్రెస్ పార్టీలో చేరిక

❑ **ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులైన వారు మైనంపల్లి హనుమంతరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో కండువాలు కప్పుకుని చేరడం జరిగింది.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 15 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో రజక సంఘం బేడా నంబర్ 2 సుమారు 100 కు పైగా సంఘ సభ్యులు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి, ఆకార్షితులై మైనంపల్లి హన్మంతన్న ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొని పార్టీ లో చేరడం జరిగింది. హన్మంతన్న మాట్లాడుతూ ఇప్పటికే రజక సంఘానికి 8 లక్షలు ఫండ్ ఇవ్వడం జరిగింది. ఇంకా సంఘం పూర్తి చేయయడానికి కావలసిన ఫండ్ కూడా ఇస్తానని మాటయివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు, కౌన్సిలర్స్ పుట్టి సందీప్, దేవుని రంజిత్, కోఆప్షన్ సభ్యులు దేమే యాదగిరి, డి సి సి ఉపాధ్యక్షులు చింతల యాదగిరి, డి సి సి కార్యదర్శి పోచమ్మల గణేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షులు దాకి స్వామి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సరఫ్ యాదగిరి, చింతల స్వామి, రజక సంఘ అధ్యక్షులు ఊర యాదగిరి, ఉపాధ్యక్షులు మ్యాతరీ బాలయ్య, కోశాధికారి కోనాపురం చిన్న మల్లేశం, సెక్రటరీ కోనాపురం స్వామి, జాయింట్ సెక్రటరీ ఊర ముకేశ్, యం స్వామి, యు బాలరాజు, మద్దూరి భూపాల్, కోనాపురం పెద్ద మల్లేశం,పి సత్తయ్య, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# రామాయంపేట కస్తూబా గాంధీ బాలికల విద్యాలయంలో పిక్ మసి ప్రోగ్రాం నిర్వహణ

❑ **కథక్ నృత్య కళాకారుని హన్సిక అగర్వాల్ హాజరయ్యారు.**
❑ **బాలికలకు కథకు నృత్య కలలను చేసి సూచించారు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 15: (జన సంఘర్షణ)



రామాయంపేట లో గల కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో స్పీక్మసి ప్రోగ్రాంలో భాగంగా కథక్ నృత్య కళాని హన్సిక అగర్వాల్ రామాయంపేటలో గల కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయానికి విచ్చేసి బాలికలకు కథకులో ఉన్నటువంటి భంగిమలు, నృత్య శైలిని చూపించి అర్థం చేయించి సుమారు రెండు గంటల పాటు ఆ పాఠశాలలో బాలికలతో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ పాఠశాల సిబ్బంది పాఠశాలల ఉపాధ్యాయినిలతో హల్లాదకరమైన వాతావరణంలో గడిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలో గల సిబ్బంది అందరూ పాల్గొన్నారు. సిబ్బంది అందరూ చాలా సంతోషాన్ని వ్యక్తం చేయడం జరిగింది.

# అక్కన్నపేటలో గృహప్రవేశానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్.




ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 15 (జన సంఘర్షణ)

మెదక్ జిల్లా రామయంపేట మండలం అక్కన్నపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాపయ్య ఎల్లం గృహప్రవేశానికి కాంగ్రెస్ పార్టీ నాయకుడు లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ కి ఆహ్వానించగా వారి ఆహ్వానాన్ని మన్నించి బుధవారం గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు రాజు, చింటూ, ఎల్లం, నాగరాజు, ప్రవీణ్, సిద్ధ రాములు, నర్సింలు, బాలకృష్ణ, సురేష్, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ ఖిల్లా అభివృద్ధిలో భాగంగా వివిధ పనులను పర్యవేక్షించిన మెదక్ మున్సిపల్ కమిషనర్ నవీన్

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 15 (జన సంఘర్షణ)



మెదక్ ఖిల్లా అభివృద్ధిలో భాగంగా బుధవారం 15 రోజున మెదక్ ఖిల్లా యందు చేపట్టుచున్న వివిధ పనులను మెదక్ మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షించినారు. ఇందులో భాగంగా మెదక్ ఖిల్లా కోట గోడలను డామేజ్ చేసే విధంగా పెరిగిన చెట్లను పర్యాటకులకు ఇబ్బంది కలిగించే విధంగా ఉన్న చెట్లను తొలగించడం జరుగుతున్నది.ఇట్టి పనులను మెదక్ మున్సిపల్ కమిషనర్ వై నవీన్ పర్యవేక్షించి పనులను చేయిస్తున్న సూపర్వైజర్లకు సూచనలు జారీ చేసినారు. ఇలాంటి పనులను చేయడం వల్ల మెదక్ ఖిల్లా కు వచ్చే పర్యాటకులకు ఖిల్లా ప్రాంతమంతా ఆహ్లాదకరంగా మారుతుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ పకడ్బందీగా అమలు చేయాలి

❑ **మెదక్ జిల్లాలో 67.08 సర్ నమోదు.**
❑ **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**




జిల్లాలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ , జిల్లా ఎన్నికల అధికారి అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..మెదక్ జిల్లాలో 67.06 శాతం సర్ నమోదు అయిందన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా, అనర్హుల పేర్లు తొలగించే ప్రక్రియను నిబంధనల మేరకు నిర్వహించాలని సూచించారు. ఇంటింటి సర్వే, ఫీల్డ్ వెరిఫికేషన్, దరఖాస్తుల పరిశీలన వంటి ప్రతి దశను అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని తెలిపారు.బూత్ స్థాయి అధికారులు (బి ఎన్ ఓ లు) తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి, ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అందిన దరఖాస్తులను ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఓటరు జాబితా స్వచ్ఛతను కాపాడేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం కొనసాగిస్తూ పూర్తి పారదర్శకతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులను తప్పనిసరిగా పాటించాలని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

# సీ.సీ రోడ్డు పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ కానుగు రాధికా భూపతిరాజు

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 15 (జన సంఘర్షణ)



మెదక్ పట్టణంలో 12 వార్డు జర్నలిస్ట్ కాలనీలో టియుఎఫ్ ఐడిసి నిధులు రూపాయలు కోటి తో చేపడుతున్న అంతర్గత సీ.సీ రోడ్డు పనులను బుధవారం మున్సిపాలిటీ డిప్యూటీ ఈ ఈ సత్యనారాయణతో కలిసి బుధవారం మున్సిపల్ చైర్మన్ కానుగు రాధికాభూపతి రాజు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జర్నలిస్టు కాలనీలో ఉన్న సమస్యలను స్థానిక గౌరవ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మైనంపల్లి హనుమంతరావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన అంతర్గత రోడ్ల నిర్మాణం సైతం పూర్తిచేసేలా చొరవ తీసుకుంటామన్నారు. ప్రస్తుతం ఉన్న రూ.కోటి రూపాయలతో జర్నలిస్టు కాలనీ నుంచి 6 మీటర్ల వెడల్పుతో బస్తీ దవాఖాన వరకు 500 మీటర్ల పొడవుతో సీ.సీ నిర్మాణం పనులుజరుగుతున్నాయని, మిగిలి పోయిన పనులు బస్తీ దావఖానా నుంచి మెదక్ వెల్దుర్తి ప్రధాన రోడ్డు వరకు పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామన్నారు. దీంతో జర్నలిస్టుల కాలనితో పాటు డబుల్ బెడ్ రూమ్ కాలనీ ప్రజల రోడ్డు సమస్య పరిష్కారం కానుంది అన్నారు. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కానుగు భూపతిరాజ్, మున్సిపల్ ఇంజనీరింగ్ వర్క్ ఇన్స్పెక్టర్లు సలీమ్, దుర్గాపతి సైట్ వర్క్ ఇన్స్పెక్టర్ ఉదయ్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

## చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గానికి ఘనంగా సన్మానించిన రుద్రూర్ కాంగ్రెస్ నాయకులు


నిజామాబాద్ జిల్లా, రుద్రూర్మండలం,జులై 15 ( జన సంఘర్షణ):



నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రం జూలై 13, జూలై 10 వ తారీఖున జరిగిన చేనేత సహకార సంఘం ఎన్నికలలో భారీ మెజార్టీతో గెలిచిన సభ్యులకు రుద్రూర్ మండల కాంగ్రెస్ నాయకులు మాజీ జడ్పిటిసి నారోజీ గంగారాం, మాజీ సొసైటీ అధ్యక్షులు పత్తి రాము, రుద్రూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు తోట అరుణ్ కుమార్, సీనియర్ నాయకులు తోట సంగయ్య, అక్కపల్లి నాగేందర్ లు ఘనంగా సన్మానించారు, సన్మానం అందుకున్న వారు సంఘం అధ్యక్షులు లోల శంకర్, ఉపాధ్యక్షులు మోత్కూరి నారాయణ, ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్ పహాడే, డైరెక్టర్లు బేతి గంగారాం, మోత్కూరి సాయిలు, మోత్కూరి లక్ష్మణ్, తాటిపాముల విజయ్, మోత్కూరి కళావతి, జొర్రిగల లక్ష్మి ఉన్నారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి అందరూ పాటుపడాలని కార్మికుల పక్షాన ఉండి వారికి సహాయసర సహకారాలు అందించాలని అదేవిధంగా నూతన కమిటీ సభ్యులందరికీ మంచి పేరు ప్రతిష్టలు రావాలని వారు ఆకాంక్షించారు. ఇంకా ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం సిబ్బంది ఈర్వ నాగరాజ్, నర్సింహులు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చైతన్ నగర్‌లో పోతంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

పోతంగల్/ జులై 15 /(జన సంఘర్షణ)




నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం చైతన్ నగర్ గ్రామంలో గ్రామీణ ప్రజలకు కంటి సంబంధిత సమస్యలపై అవగాహన కల్పించేందుకు సర్పంచ్ కాంత సునీల్



ఆధ్వర్యంలో, పోతంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో వృద్ధులు, మహిళలు, యువకులు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు కంటి సమస్యలు ఉన్నవారికి ప్రాథమిక పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆపరేషన్ అవసరమైన వారికి తదుపరి వైద్య సహాయం అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాంత సునీల్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజల ఆరోగ్యమే మా లక్ష్యం. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను భవిష్యత్‌లోనూ నిర్వహిస్తాం. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని అన్నారు.కార్యక్రమంలో పాల్గొన్నవారు:పోతంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పున్నే అర్జున్, ఉపాధ్యక్షుడు గంధపు దత్తు, ప్రధాన కార్యదర్శి వడ్ల సురేష్, కార్యదర్శి బ్యాగరి విజయ్ కుమార్, సహాయ కార్యదర్శి ఎర్రోళ్ల యాదవ్ రావు, కోశాధికారి సర్గు లక్ష్మణ్, గౌరవ సలహాదారులు నూత్ పల్లి గణేష్, కనకమెడల శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్ పాకాల గజేందర్, కార్యవర్గ సభ్యులు మొండే భీమ్ రావు, రాజేష్, ముత్యాల శ్రీకాంత్, షేక్ అజారుద్దీన్, సద్దాం, శ్రీను, ఉప సర్పంచ్ యాదవ్ మరియు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి శిబిరాలు నిర్వహించడం వల్ల పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## కూకట్పల్లిలో ఆత్మీయ సమ్మేళనం...

- పిసిసి ఉపాధ్యక్షులు, కమ్మ కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షులను ఘనంగా సన్మానించిన కమ్మ సత్యనారాయణ

కూకట్‌పల్లి/ జూలై 15 /(జనసంఘర్షణ)



కూకట్‌పల్లిలో బుధవారం జరిగిన ఆత్మీయ సమ్మేళన అభినందన సభలో, కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి ఇంచార్జ్ రాష్ట్ర పీసీసీ ఉపాధ్యక్షులు, కమ్మ కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బండి రమేష్ ని, ఉపాధ్యక్షులు పరిచూరి మురళిని సన్మానించి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేసిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కమ్మ సంఘం అడ్వైజర్ కమిటీ సభ్యులు కమ్మ సత్యనారాయణ. రాష్ట్ర ఇఫ్కో మాజీ డైరెక్టర్ సోమశేఖర రావు.

## తెలంగాణ రాష్ట్ర వాడబలిజ సేవా సంఘం ఆత్మీయ సమ్మేళన సమావేశం

- రాష్ట్ర ఉపాధ్యక్షుడు గార ఆనంద్

ములుగు జిల్లా, వాజేడు మండలం, జులై 15(జనసంఘర్షణ):

వాజేడు మండలం, ఎడుజర్లపల్లి సమావేశం లో వాడబలిజ కులస్తుళ్ళు అందరుతో మాట్లాడుతూ.. మన కులస్తులు అందరూ ఐకంగా ఉండాలని కోరారు. మన వృత్తి చేపలు పట్టడం వలన ప్రభుత్వం మనల్ని మత్స్య కారులుగా గుర్తించింది. మన యొక్క కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం లు, ప్రకటించిన సబ్సిడీ రుణాలు మనకు రావలి అంటే మనందరంము మత్స్య శాఖ సొసైటీ సంఘం ఏర్పాటు చేసుకోవాలి, సొసైటీ సభ్యత్వాలు తీసుకోవాలి, దీని ప్రయోజనాలు చేపలు పట్టడం కొరకు వలలు, పడవలు, చేపలు అమ్మడం కొరకు వేహికిల్, మన కు పట్ట భూమి ఉన్న వారికీ గ్రామపంచాయతీలో చేపల చెరువు ఉన్నట్లయితే చేప పిల్లలు పెంచడం కొరకు మనకు బ్యాంకు ద్వారా సబ్సిడీ రుణాలు ఇస్తారు, రుణాలు ఇస్తారు, బీసీ కులం లో వెనుకబడి ఉన్న ఓడ బలిజ బీసీ ఎ లో మన పిల్లలు చదువు కొని డిగ్రీ, బీటెక్ చదువుకొని ఉన్న కూడ ఉద్యోగ అవకాశాలు లేక కొందరు వ్యవసాయ కూలిలు గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మన అందరం కలిసికట్టుగా ఉన్నట్లయితే ప్రభుత్వం నుండి రావాల్సిన ప్రతి ఒక్క లబ్దిని పొందగలుగుతామని మాట్లాడినారు. ఈ సమావేశంలో గార పాపారావు, గార సర్వేశ్వరరావు, గార మోహన్రావు, గార కృష్ణ మోహన్ రావు, సండుగొండ గంగయ్య, అల్లి సమ్మయ్య, అల్లి నరసింహారావు, సంద్ర సమ్మయ్య, గౌరారపు శ్రీను, అంకటి నాగేశ్వరరావు, సనుగొండ సమ్మయ్య, గార వెంకటేశ్వర్లు, గార వినోదు, సంద్ర పవన్, ఎక్కేల వీర



స్వామి, చిటమాట సత్యం, తోట లక్ష్మీనారాయణ, గార చిన్ని వెంకటేశ్వర్లు, తోట ముత్తయ్య తదితరులు ఈ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు.

## బాధితులను ఆదుకోండి.. బహుమతి పొందండి

బోధన్/జూలై 15/( జనసంఘర్షణ)



కేంద్ర ప్రభుత్వం తెచ్చిన పీఎం రాహత్, పీఎం రాహ్-వీర్ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బోధన్ రూరల్ ఎస్ఐ రాజశేఖర్ సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి బాధితులను ఆసుపత్రికి చేరిస్తే పీఎం రాహత్ కింద రూ. 1.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందుతుందని, సహాయం చేసిన వారికి రాహ్-వీర్ కింద రూ. 25 వేల బహుమతి లభిస్తుందని తెలిపారు. భయపడకుండా 100 లేదా 108 /112 నంబర్లకు కాల్ చేసి ప్రాణాలు కాపాడాలన్నారు.

## ప్రత్యేక అభిషేకం పూజలు చేస్తున్న రైతులు

నిజామాబాద్ జిల్లా,రుద్రూర్ మండలం,జూలై 15( జన సంఘర్షణ):



నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలం అంబం ఆర్ గ్రామంలో వర్షాలు కురవకపోవడంతో గంగాజదాలు తెచ్చి అంబం గ్రామంలో వర్షాలు కురవాలని గ్రామంలోని మందిరాలలో దేవుళ్ళకు గంగా నీరు తీసుకువచ్చి అభిషేకం ప్రత్యేక పూజలు చేసిన గ్రామ కమిటీ అధ్యక్షులు బడే రాము ఉపాధ్యక్షుడు బట్టు వీరయ్య క్యాషియర్ సగిరెల్లి పండరి, కార్యదర్శి శ్రీకాంత్, గ్రామ సర్పంచ్ కూర్లేపు గంగాధర్, ఉప సర్పంచ్ రేపల్లె సాయి ప్రసాద్, వార్డు సభ్యులు సుంచు పవన్, రామసాని సాయి కుమార్, గ్రామ పెద్దలు మంత్రి గంగారం తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత విద్య ద్వారా ప్రయోజకులు కావాలి

- వనవాసీ విద్యార్థులకు వాజేడు కానిస్టేబుల్ ప్రసాద్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,చర్ల మండలం,జూలై 15 (జనసంఘర్షణ):

చర్ల, వానవాసి కల్యాణ పరిషత్ నిలయం,విద్య ద్వారా ప్రయోజకులు కావాలని ఇందుకు గాను ఇప్పటి నుండే ఖచ్చితమైన ప్రణాళిక రూపొందించుకోవాలని ములుగు జిల్లా వెంకటాపురం పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా విదులు నిర్వహిస్తున్న వేమాల ప్రసాద్ ఉద్బోదించారు. ప్రసాద్, సునీత దంపతుల ద్వితీయ కుమారుడు నిహాల్ జన్మదినం సందర్భంగా వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం నిలయ విద్యార్థులకు ఒక జత దుస్తులతో పాటు కంబాక్స్ లు, పెన్నులు, పెన్సిల్స్, పండ్లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వనవాసీ కొమరం భీం నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రసాద్ విద్యార్థులను ఉద్దేసించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. తాము ఏమి కావాలో చిన్ననాటి నుండే లక్ష్యాన్ని నిర్దేసించుకొని ముందుకు సాగినప్పుడే అనుకున్న లక్ష్యాన్ని సాదించవచ్చని అన్నారు. ఇక్కడి విద్యార్థుల క్రమశిక్షణ



తనకు ఎంతగానో ఆకట్టుకుందని అందుకే వెంకటాపురంలో విదులు నిర్వహిస్తున్నప్పటికితమ కుమారుని జన్మదినం ఇక్కడ జరుపుకుని వితరణలను అందచేసామన్నారు. కొమరం భీం నిలయ కార్యదర్శి మురళీకృష్ణ మాట్లాడుతూ జన్మదినం, శుభ, కార్యక్రమాలతో పాటు ఇతర సందర్భాలలో డబ్బు వృదా చేయకుండా విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమని అన్నారు. సంస్ద ప్రభుత్వం నుండి ఎటువంటి ఆర్థిక సహకారం, ఇతర సౌకర్యాలను పొందదని కేవలం దాతల సహకారంతో నడుస్తుందని వెల్లడించారు. గిరిజనుల అభ్యున్నతి కొరకు సంస్ద దేశ వ్యాపితంగా విద్యార్థి నిలయాలను నిర్వహిస్తోందని తెలిపారు. వనవాసీ విద్యార్థులకు దాతలు అందచేస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగపరుచుకొని దాతల నమ్మకాన్ని వమ్ముచేయకుండా చదువుపై దృష్టిసారించి ఉన్నత స్దితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యతోనే వినయం విదేయత వస్తుందని, కుటుంబంలో ఒక్కరు చదువుకొని జీవితంలో స్థిరపడితే ఆకుటుంభం మొత్తం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అందుకే తాము విద్యపై దృష్టిసారించి పేద విద్యార్థులకు సహకారమందించడంతో పాటు వారిని ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు. గిరిజన విద్యార్థుల సంక్షేమం, అభ్యున్నతి కొరకు పాటుపడే సంస్దకు దాతలు తమవంతు సహకారమందించి విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపాలని విజ్ఞప్తి చేసారు. కార్యక్రమంలో వేమాల సునీత, వనవాసీ జిల్లా సహ కార్యదర్శి గోగికార్ రాంలక్ష్మణ్, జిల్లా సంఘటనా సహ కార్యదర్శి గొంది శోభన్ బాబు, కొమరం భీం నిలయ ప్రముఖ్ ఆకుల సాంబయ్య, శబరి బాలికా నిలయ ప్రముఖ్ వరలక్ష్మి, మడకం చందు, కూడం ఉంగయ్య, ప్రసాద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ అన్న ఆశయాలను సాధిద్దాం

- ఖమ్మం పట్టణంలో జరిగే రాయల చంద్రశేఖర్ అన్న రెండో వర్ధంతి సభ ను జయప్రదం చేయండి
- సిపిఐఎంల్ మాస్ లైన్ పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులకు రంగారెడ్డి
- రాయల చంద్రశేఖర్ భద్రాచలం డివిజన్ కమిటీ ఘనంగా నివాళులర్పించారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,భద్రాచలం, జులై 15(జనసంఘర్షణ):

దేశంలో పాలకులు మారుతున్నారు కానీ రైతుల జీవితాలు మారటం లేదని అలాంటి రైతాంగం కోసం ఆహర్నిశలు శ్రమించి వారి హక్కుల కోసం జీవితాన్ని త్యాగం చేసిన ఆదర్శ రైతుల పక్షపాతి అమరుడు రాయల చంద్రశేఖర్ రెండో వర్ధంతి సభ భద్రాచలం డివిజన్ పార్టీ ఆఫీసులో జరిగింది. ఈసభలో సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కే రంగారెడ్డి మాట్లాడుతూ.. కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ రైతాంగ ఉద్యమంలో అఖిలభారత స్థాయి నాయకుడిగా ఉత్తర దేశ పర్యటన చేశారని. చరిత్రక మైన ఢిల్లీ సరిహద్దులో కొనసాగిన రైతాంగ పోరాటంలో పాల్గొని మూడు నల్ల చట్టాలను రద్దు చేసేంతవరకు చంద్రశేఖర్ పోరాటంలో కొనసాగారని అన్నారు. ఎమర్జెన్సీ



అనంతరం సిపిఎంఎల్ పార్టీ ఇచ్చిన పిలుపుని అందుకొని రైతు కూలీ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షునిగా. రాష్ట్ర నాయకుడిగా సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ గా స్థాయికి ఎదిగిన నాయకుడు మన మధ్య దూరం కావడం తీరనీ నష్టమని అన్నారు. 16-7- 26న పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో సంతాప సభ జరుగుతుందని దీనిని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కల్పనక్క, దాసరి సాయన్న, మునిగేలా శివ ప్రశాంత్, ప్రణయ్ , శాంతక్క, సరళ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు రేపటి తెలంగాణ పునర్నిర్మానంలో అత్యంత కీలకపాత్ర పోషించాలి

◆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు





హైదరాబాద్/ జూలై 15/( జన సంఘర్షణ)

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు రేపటి తెలంగాణ పునర్నిర్మాణంలో అత్యంత కీలక పాత్ర పోషించాలి. పలుగు, పార పట్టిన చేతులే.. కలాలు పట్టి తెలంగాణ రాత మార్చాలి" అని ముఖ్యమంత్రి . రేవంత్ రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. "ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోండి. చదువొక్కటే భవిష్యత్తును నిర్ణయిస్తుంది. మన జీవితాల్లో వెలుగులు నింపుతుంది. చదువే సమాజంలో ఆత్మగౌరవాన్ని పెంచుతుంది. తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందం నింపుతుంది" అని విద్యార్థులకు ఉద్బోధించారు. వనపర్తి జిల్లా కొత్తకోటలో బాలికల ఉన్నత పాఠశాల నూతన భవనానికి ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు , జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి తో పాటు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొద్దిసేపు విద్యార్థినులతో ముఖ్యమంత్రి ముచ్చటించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆగస్టు 15 నాటికి 9 రకాల వస్తువులతో కూడిన కిట్లను అందిస్తామని ప్రకటించారు. "రూ. 1000 కోట్లకుపైగా ఖర్చు పెట్టి, ఆగస్టు 15వ తేదీ లోపు రాష్ట్రంలోని 27.50 లక్షల మంది విద్యార్థులకు తెలంగాణ ఎడ్యుకేషన్ కిట్లను ఇవ్వబోతున్నాం. అవి అందుకున్న తర్వాత.. మీకు వచ్చిన వస్తువులు బాగున్నాయా? లేదా వాట్సాప్ వేదికగా చెప్పడానికి విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది" అని తెలిపారు. "సరైన మౌలిక సదుపాయాలు లేక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయకపోతే వందేళ్లయినా సమస్య పరిష్కారం కాదు. అందుకే ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రభుత్వ పాఠశాల ప్రతిష్టను పెంచడానికి నిరంతరం పనిచేస్తున్నాం. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని శపథం తీసుకుని పనిచేస్తున్నా" అని పేర్కొన్నారు.



"ఒకటి రెండేళ్లలో మొత్తం వ్యవస్థ బాగుపడుతుందని భావించడం లేదు. కొంత సమయం పడుతుంది. ప్రజాప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉపాధ్యాయులకు 16 ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు, పదేండ్లుగా జరగని బదిలీలను చేపట్టాం. ప్రశాంతంగా చదువు చెబుతారన్న ఆలోచనతో 317 జీవోను అమలు చేసి చెదిరిపోయిన కుటుంబాలను ఒకచోట చేర్చాం. విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు కష్టపడుతున్నారు. అందుకే కేంద్ర విద్యా శాఖ ప్రకటించిన పర్‌ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ 36వ స్థానం నుంచి 18వ స్థానానికి ఎదిగాం. దీంతో సంతృప్తి చెందాల్సిన అవసరం లేదు. మొదటి రెండు స్థానాలు సాధించే వరకు నిరంతరం పనిచేయాలి. రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున ప్రతిభ కనబరిచిన టీచర్లకు అవార్డులు ఇవ్వాలని నిర్ణయించాం" అని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రపంచంలో మంచి విద్యావిధానం అమలు చేస్తున్న దేశాల్లో అధ్యయనం కోసం 50 మంది ఉపాధ్యాయులను విదేశాలకు పంపించామని, వచ్చే ఏడాది 150 మంది టీచర్లను పంపిస్తామని చెప్పారు. "ఏఐ విప్లవం వచ్చిన తర్వాత వైట్ కాలర్ జాబ్స్ పోయే ప్రమాదమొచ్చింది. అందుకే యువతలో స్కిల్స్ పెంచి బ్లూ కాలర్ జాబ్స్ అందించేలా ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. విద్యార్థులకు జర్మన్, జపనీస్ లాంటి భాషలను నేర్పించాలి. అవకాశాలను అందిపుచ్చుకోవాలి" అని కోరారు. ఈ ప్రభుత్వ పాఠశాలలే తెలంగాణ నిర్మాణంలో అత్యంత క్రియాశీల పాత్ర పోషించాలి. ప్రభుత్వ పాఠశాలల నుండి వచ్చిన ఈ పిల్లలే డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు, సైంటిస్టులుగా రాణించాలన్నారు. చదువులో రాణించలేని వారు మైదానాల్లో రాణించాలని కోరారు. "క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంది. ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం ఏటా రూ. 1.08 లక్షలు ఖర్చు పెడుతోంది. ఇంత మొత్తంలో ఖర్చు చేస్తున్నప్పుడు కచ్చితంగా బాగా చదువుకుని నిరూపించుకోవాలి" అని ఉద్బోధించారు.

# ప్రతి ఇంటా ఇంకుడు గుంత నిర్మించుకోవాలి

◆ మున్సిపల్ చైర్‌పర్సన్ పిలుపు.
◆ వర్షపు నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమం...





బోధన్/జూలై 14/(జన సంఘర్షణ)


బోధన్ కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక 'జల జీవన్ మిషన్ అభియాన్' ఆధ్వర్యంలో వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ, ఇంకుడు గుంతల ప్రాముఖ్యతపై బుధవారం బోధన్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వర్షపు నీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా చేయాల్సిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్, మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. వర్షపు నీరు ఎక్కడ పడితే అక్కడే భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూమిలోకి ఇంకించడం ద్వారా క్రమంగా తగ్గిపోతున్న భూగర్భ జల మట్టాలను పెంచుకోవచ్చని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీటి వనరుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు నీటి ఎద్దడి రాకుండా చూడాలంటే నీటి సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.
ప్రతి చుక్క వర్షపు నీటిని సద్వినియోగం చేసుకుంటే భూగర్భ జలాల పెంపునకు ఎంతో ఉపయోగపడుతుందని వారు తెలిపారు. వర్షపు నీరు నేరుగా కాలువల్లోకి వెళ్లకుండా ఆయా ప్రాంతాల్లోనే ఇంకిపోయేలా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. పట్టణ పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థలు, విద్యాసంస్థలతో పాటు ప్రతి ఇంట్లో తప్పనిసరిగా ఇంకుడు గుంతలను , నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. వర్షపు నీటి సంరక్షణపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని అధికారులు తెలిపారు. ప్రజలు, ప్రభుత్వ విభాగాలు, సంస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే భూగర్భ జలాలను కాపాడుకోవడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్, మున్సిపల్ కమిషనర్తో పాటు పట్టణ కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వర్షాలు లేక పంట పొలాల దృశ్యాలు

◆ నిజం సాగర్‌లో నిలువున్న నీటి 6,5, విడుదల చేయాలని ధృవీక పాత్రను అందజేశారు

నిజామాబాద్ జిల్లా, రుద్రూర్, జూలై 15( జన సంఘర్షణ):

నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రం ఈరోజు తహసిల్దార్ వినోద్ పత్రం అందజేశారు రైతులు బిజెపి నాయకులు. విషయం జిల్లాలో వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా పంటల సాగుకు సాగునీటి సరఫరా రైతు సమస్యల పరిష్కారం కోసం తక్షణమే ఇరిగేషన్ శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించడం గురించి. ప్రస్తుత వర్షాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం వల్ల రుద్రూర్ మండలం లో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే వేల ఎకరాల్లో రైతులు వరి నాట్లు వేయగా, వర్షాలు లేకపోవడం ప్రాజెక్టుల నుండి సాగునీరు సక్రమంగా అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. ముఖ్యంగా బాన్సువాడ,నియోజకవర్గం లో అన్ని మండల ప్రాంతాల్లో రైతులు ఇప్పటికే పెట్టుబడి పెట్టి రెండోసారి నాట్లు వేసినప్పటికీ, నీటి లభ్యత లేక తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నారు. మండలంలో చాలాచోట్ల రైతులు బోర్లపై ఆధారపడి వరి సాగు చేస్తున్నారు. అయితే,



వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు అడుగంటి, బోర్లు ఎండిపోతున్నాయి. దానికి తోడు, సరైన సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడం వల్ల రైతులు పంటలను కాపాడుకోలేక తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో సాగునీటి నిర్వహణపై ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించకపోవడం బాధాకరం. ప్రజాప్రతినిధులు ప్రభుత్వ యంత్రాంగం రైతులను ఆదుకునే దిశగా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. కావున, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఇరిగేషన్ శాఖాధికారులతో తక్షణమే అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి, నిజాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న 6.5 టీఎంసీల నుండి, సాగునీటిని ఏ మేరకు, ఎప్పటి నుండి విడుదల చేస్తారో రైతులకు స్పష్టత ఇవ్వాలి. పంటల పరిస్థితిపై క్షేత్రస్థాయిలో అంచనా వేసి, ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు తక్షణ కార్యాచరణను సిద్ధం చేయాలి. రైతులు ఆందోళన చెందకుండా వారిని ఆదుకునేలా మీరు ప్రత్యేక చొరవ చూపాలని భారతీయ జనతా పార్టీ తరపున కోరుచున్నాము. తక్షణమే స్పందించి రైతులకు భరోసా కల్పిస్తారని ఆశిస్తున్నాము.



# బోధన్ పట్టణంలోని ఎంపిఆర్ కార్యాలయంలో సర్ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహణ

బోధన్/జూలై 15/( జన సంఘర్షణ)




ఈ సమావేశానికి రాష్ట్ర పార్టీ సర్ టీమ్ సభ్యులు కొంజర్ల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి ఎంపీఆర్ బోధన్ నియోజకవర్గంలో ఇప్పటికే పూర్తయిన సర్ కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాలను రాష్ట్ర పార్టీ సర్ టీమ్ సభ్యులు కొంజర్ల శ్రీనివాస్ గారికి వివరించారు. అనంతరం నియోజకవర్గంలోని వివిధ మండలాలు, బూత్‌లలో నిర్వహించిన సర్ కార్యక్రమం పురోగతి, నమోదైన వివరాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కొంజర్ల శ్రీనివాస్ గారు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తలను అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా పార్టీ ఆదేశాలకు అనుగుణంగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎడపల్లి సర్పంచ్ కందగట్ల రాంచందర్, జిల్లా ఐటీ సెల్ ఇంచార్జి పిల్లి శ్రీకాంత్, వివిధ మండలాల అధ్యక్షులు గోపీకిషన్, ఇంద్రకరణ్, సుదర్శన్, సీనియర్ నాయకులు సుధాకర్ చారి, గుంత గంగాధర్, మల్లెపూల శ్రీనివాస్, ఇర్వంత్ రావు పటేల్, పవన్, ప్రధాన కార్యదర్శి అర్వింద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్డీవో కార్యాలయంలో బోధన్ ఆర్డీవో విజయ కుమారి

బోధన్/జూలై 15/(జన సంఘర్షణ)



బోధన్ ఎమ్మార్వో విట్టల్ అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సర్ గురించి సమీక్ష నిర్వహించి డిజిటలైజ్డ్ కానీ ఓటర్ల లిస్ట్ ఇచ్చి వారికి సరియైన అవగాహన కల్పించి ఎన్యూమరేషన్ ఫార్మ్స్ తిరిగి ఇచ్చే విధంగా చేయాలనీ కోరడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో అన్నీ పార్టీల నాయకులతో పాటు బోధన్ బిజెపి పట్టణ అధ్యక్షులు పసుపులేటి గోపికిషన్, ఎడపల్లి మండల అధ్యక్షుడు బీఎల్ఏ 1కోల ఇంద్రకరణ్, బోధన్ రూరల్ అధ్యక్షుడు సిర్ప సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ ఇండియా ఇంటర్నేషనల్ టీ20 18th ఫెడరేషన్ యూ-19 కప్ గెలిచిన తెలంగాణ క్రికెట్ టీమ్..

ఉత్తరప్రదేశ్/జులై 15/(జన సంఘర్షణ)







ఉత్తరప్రదేశ్ (ఆగ్ర) వేదికగా ఆల్ ఇండియా ఇంటర్నేషనల్ టీ20 18వ ఫెడరేషన్ ఖ19 కప్ లో మహారాష్ట్ర టీంతో జరిగిన ఫైనల్లో మన ప్రియతమ నాయకులు గౌరవ జాలే నరసింహారెడ్డి పీసీసీ సభ్యులు, చైర్మన్ కుమారుడు జాలే సాత్విక్ రెడ్డి (కెప్టెన్) సారథ్యంలో ఆగ్రాలోని రైల్వే స్టేడియంలో జరిగిన మహారాష్ట్ర జట్టును ఓడించి టైటిల్ గెలిచిన తెలంగాణ యూ-19 క్రికెట్ టీమ్ ఫైనల్లో గెలిచిన అనంతరం తెలంగాణ యూ-19 కెప్టెన్ జాలే సాత్విక్ రెడ్డిని కోచ్, సహచర ఆటగాళ్లు అభినందించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ యూ-19 క్రికెట్ టీమ్ జట్టు నా కుమారుడు సాత్విక్ రెడ్డి సారథ్యంలో టైటిల్ గెలవడం ఎంతో సంతోషంగా ఉంది అన్నారు. అదే విధంగా రాబోయే రోజుల్లో తన కుమారుడు తప్పకుండా జాతీయ జట్టుకు సెలెక్ట్ అవుతాడని ధీమా వ్యక్తం చేశారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
గురువారం
16 జులై 2026

# ఎండుతున్న పంటలు... నిజాంసాగర్ నీటి కోసం ఉద్యమం

- బారస, భాజపా ఆధ్వర్యంలో అధికారులకు వినతి పత్రాలు
- హల్దీ వాగు నుంచి నీటిని నిజాంసాగర్ పై తరలించాలి
- గతంలో శాసనసభాపతి పోచారం ప్రకటించిన విధంగా నీటిని తీసుకురావాలి
- మాజీ ఎమ్మెల్యే బారాస సీనియర్ నాయకులు బాజిరెడ్డి గోవర్ధన్ డిమాండ్





కోటగిరి/ జూలై 15/(జనసంఘర్షణ)

వర్షాభవ పరిస్థితుల వల్ల నిజాంసాగర్ ఆయకట్టు కింద సాగుచేసిన పంటలు ఎండిపోతుంటే పాలకులు, పట్టించుకోవడం లేదంటూ భాజపా, బారస నాయకులు ఉద్యమాలు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం భాజపా నాయకులు తాసిల్దార్ వినతిపత్రం అందజేశారు. బుధవారం కోటగిరి మండల కేంద్రంలో రెవెన్యూ కార్యాలయం ముందు బారాస మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆధ్వర్యంలో రైతు మహాధర్న కార్యక్రమం నిర్వహించారు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఆల్ది వాగు ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టులోకి రోజుకు ఒక టీఎంసీ నీటిని తరలించుకోవచ్చిందని గతంలో ప్రకటించిన ప్రస్తుత బాన్సుడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆ దిశగా అడుగులు వేసి, నిజాంసాగర్ ప్రాజెక్టులోకి నీటిని విడుదల చేయించి. నిజం సాగర్ ఆయకట్టు రైతులను ఆదుకోవాలని బాజిరెడ్డి గోవర్ధన్ డిమాండ్ చేశారు. లక్ష కోట్లు వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయింది అంటూ కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేస్తూ బారాస పార్టీపై ఉన్న కక్షతో ఉద్దేశపూర్వకంగా పంటలను ఎండ కొట్టడానికి నీటిని విడుదల చేయడం లేదంటూ బాజిరెడ్డి గోవర్ధన్ డిమాండ్ చేశారు. అభివృద్ధి పనుల కోసమే కాంగ్రెస్ పార్టీలోకి చేరినట్లు గొప్పగా చెప్పుకుంటున్న స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి, ఎండుతున్న పంటలు కనిపించడం లేదా? అంటూ బాజిరెడ్డి గోవర్ధన్, సూటి ప్రశ్న వేశారు. ఇటీవల జాకోర ఎత్తిపోతల పథకం ప్రారంభం వచ్చిన ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి నిజాంసాగర్ నీటిని విడుదల చేస్తామని ప్రకటించారు. కానీ ఆయన ప్రకటన ప్రకటనకే పరిమితమైందని బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. తక్షణం ఇరిగేషన్ శాఖ మంత్రి ప్రకటించిన విధంగా నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసి ఎండుతున్న వరి, సోయా, మొక్కజొన్న, పెసర, మినుము పంటలను కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని బాజిరెడ్డి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి తో మాట్లాడి నిజాంసాగర్ నీటిని పంటలకు విడుదల చేసే విధంగా చూడాలంటూ బాజిరెడ్డి గోవర్ధన్ డిమాండ్ చేశారు. వర్షాభావ ప్రస్తుత వల్ల ఆశించిన రీతిలో సగటు వర్షపాతం ఇప్పటివరకు నమోదు కాలేదని. చెరువులు, కుంటలు, ఎండిపోయాయని తక్షణం రైతులు వేసిన పంటలు ఎండకుండా చూడాలంటూ బాజిరెడ్డి గోవర్ధన్ ప్రభుత్వం కు డిమాండ్ చేశారు. దక్షిణాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంటలు ప్రస్తుతం వర్షాలు లేక, మరోపక్క భూగర్భ జలాలు తగ్గిపోవడంతో పంటలన్నీ ఎండుతున్నాయని. దీనిని దృష్టిలో ఉంచుకొని నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన రైతుల తో మహాధర్నా కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో బారాస సీనియర్ నాయకులు జుబేర్, అంజిరెడ్డి, శ్రీనివాస్ రావు, ఎలమంచిలి శ్రీనివాసరావు, నార్ల రత్న కుమార్. తెల్ల రవికుమార్, టిఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మె అకీమ్, సుద్దాం నవీన్, సమీర్, గులాబీ శ్రేణులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతుల పక్షపాతి పోచారం శ్రీనివాస్ రెడ్డి

- ప్రతిపక్ష నాయకుల మాటలు నమ్మొద్దు





కోటగిరి /జూలై 15/(జన సంఘర్షణ)

బాన్సువాడ నియోజకవర్గంలో కోటగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ ప్లేస్మెంట్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మండల అధ్యక్షులు ఎజాజ్ ఖాన్ మాట్లాడుతూ.. బాన్స్వాడ నియోజకవర్గంలో రైతులు ఆందోళన చెందవద్దని ఆయన అన్నారు. వర్షాలు లేకపోవడం వల్ల రైతులు నాట్లు వేసి ఉన్నారు. గత 30 సంవత్సరములు నుండి రైతుల పక్షపాతి ఆయన పోచారం శ్రీనివాస్ రెడ్డి వ్యవసాయం గురించి ఆయనకు బాగా తెలుసు అని ఆయన తెలియజేశారు. వ్యవసాయం పైన మన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి అవగాహన ఉంది కాబట్టి అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి నిజం సాగర్ కాల్వ నీళ్లు వదలాలని అధికారులతో సూచించారు. అని ఈ ప్రెస్ మీట్ లో పలువురు తెలియజేశారు. రైతులకు ఎట్లా కాపాడుకోవాలని ఆయన అక్కడ హైదరాబాదులోని అధికారులతో సమావేశం ఏర్పాటు చేసుకున్నారని తెలియజేశారు కానీ ప్రతిపక్షం వారు ధర్నా చేయడం సిగ్గుచేటని బాన్సువాడలో వ్యవసాయంపై పోచారం శ్రీనివాస్ రెడ్డికి పూర్తి అవగాహన ఉన్నదని తెలియజేశారు ఎవరో ఏదో వాగుతూ ఉంటారని ప్రతిపక్ష ల మాటలు పట్టించుకోవద్దని రైతుల సంక్షేమాన్ని పూర్తి రక్షణకై పోచారం శ్రీనివాస్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలియజేశారు వర్షం లేకపోవడం వల్ల రైతులు ఇబ్బందులకు గురి అవుతున్నారని రైతుల పట్ల నిజాంసాగర్ కాలువ నీళ్లు వదలడానికి కూడా సిద్ధంగా ఉన్నామని రైతులు ఆందోళన చెందవద్దని తెలియజేశారు. ఇవాళ రేపు గవర్నమెంట్ కు నివేదిక ఇక్కడ నుంచి పంపడం జరుగుతుందని అన్నారు భూగర్భ జలాలు ఎండిపోకుండా ముందే బోరు బావులు బంద్ కాకముందు వర్షాలు పడాలని ఆ దేవున్ని ప్రార్థిస్తున్నాము,రైతుల యొక్క బాధలు బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డికి తెలుసు అని తెలియజేశారు. రైతులకు చరవాణి ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నారని అన్నారు నిజాంసాగర్ నీళ్లు వదులుకొని దఫలవారీగా వాడుకుందామని నాయకులు తెలియజేశారు. అన్ని రకాల పంటల గురించి తెలిసిన ఘనత పోచారం శ్రీనివాస్ రెడ్డికి ఉన్నదన్నారు. ఆగస్టు ఒకటి నుండి నిజం సాగర్ కాలువ నీళ్లు విడుదల జరుగుతుందని తెలియజేశారు నియోజకవర్గంలో పెద్దలు సలహా సూచనలు ఇవ్వడంలో రాష్ట్రంలోని బాన్సువాడ నంబర్గా ఉంటుందని అన్నారు. మేమందరం కూడా రైతులమే అని ఆందోళన చెందొద్దని చెప్పారు. కోటగిరి స్థానిక సర్పంచ్ మాట్లాడుతూ.. బాన్సువాడ నియోజకవర్గంలో పోచారం శ్రీనివాస్ రెడ్డి బాన్సువాడలో లక్ష్మి పుత్రుడిగా ఉన్నారని తెలియజేశారు. రైతుల సంక్షేమం గురించి కూడా ఆయనకు తెలుసు అని చెప్పారు. రైతులకు ఎప్పుడు నీళ్లు వదలలో పోచారం శ్రీనివాస్ రెడ్డికి తెలుసు అని చెప్పారు బాన్సువాడ నియోజకవర్గంలో రైతుల కష్టాసుఖాల గురించి బాగా తెలుసు అని కోటగిరి సర్పంచ్ బర్ల మధుకర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అన్ని మండల రుద్రూరు వర్ని చందూరు కోటగిరి నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ జెడ్పిటిసి నా రోజి గంగారం రాజిరెడ్డి ఎ ఎం సి చైర్మన్ సురేష్ బాబా కోటగిరి ఏఎంసి చైర్మన్ గాయక్వాడ్ హనుమంతు కోటగిరి ఎక్స్ జెడ్ పి టి సి శంకర్ పటేల్ రుద్రూర్ పత్తి రాము ఎక్స్ జెడ్పిటిసి ఎగడోలి శంకర్ మాజీ ఎంపీపీ పవన్ మాజీ ఏఎంసీ చైర్మన్ గంగాధర్ కోటగిరి సర్పంచ్ బర్ల మధుకర్ మాజీ సర్పంచ్ కత్తి లక్ష్మణ్ మాజీ సర్పంచ్ వర్ణిశంకర్ మాజీ ఎంపీటీసీ కొట్ట మనోహర్ కోటగిరి వైస్ చైర్మన్ అనిల్ కుమార్ మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ గంగాధర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# సర్'ను లైట్ తీసుకుంటే ఓటు గల్లంతే

- 'సర్'ను లైట్ తీసుకుంటే ఓటు గల్లంతే
- ఓటు హక్కును ప్రతీ ఒక్కరూ కాపాడుకోవాలి
- కేంద్రమంత్రి బండి సంజయ్ పిలుపు
- కరీంనగర్‌లో ఎన్యుమరేషన్ ఫారం నింపి బీఎల్ఓకు అందజేసిన మంత్రి
- జూలై 24లోగా ప్రక్రియ పూర్తి చేయాలని ప్రజలకు విజ్ఞప్తి


కరీంనగర్/ జూలై 15/( జనసంఘర్షణ)

కరీంనగర్ : ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దని, అలా చేస్తే ఓటు గల్లంతయ్యే ప్రమాదం ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. ఓటరు జాబితాలో పేరును సరిచూసుకోవడం, వివరాలను నమోదు చేయడం అనేది ప్రజాస్వామ్య బాధ్యతని ఆయన స్పష్టం చేశారు. కరీంనగర్ పర్యటనలో భాగంగా చైతన్యపురిలోని సాధన స్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రానికి వెళ్లిన బండి సంజయ్, స్వయంగా ఎన్యుమరేషన్ ఫారాన్ని నింపి బీఎల్ఓకు అందజేశారు. అనంతరం ఆన్‌లైన్‌లో కూడా తన వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా సర్ ప్రక్రియ పురోగతి, ఎన్యుమరేషన్ దరఖాస్తుల పంపిణీపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. జూలై 24వ తేదీలోపు ఎన్యుమరేషన్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండగా, రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 50 శాతం మంది మాత్రమే ఫారాలు సమర్పించినట్లు అధికారులు ఆయనకు వివరించారు.

**నిర్లక్ష్యం వద్దు.. ఓటును కాపాడుకోండి...**

ఈ సందర్భంగా బండి సంజయ్ రాష్ట్ర ప్రజలకు పలు సూచనలు చేశారు. గడువు ముగిసే వరకు వేచి చూడకండి: "జూలై 24 వరకు గడువు ఉంది కదా అని నిర్లక్ష్యం చేయవద్దు. చివరి రోజు కోసం ఎదురుచూడకుండా ఈ రోజే ఎన్యుమరేషన్ ఫారం నింపండి.ష బీఎల్ఓలకు సహకరించండి: "బీఎల్ఓ ఇంటికి వస్తే సహకరించి, ఫారం తీసుకుని వివరాలు సరిచూసి గడువులోగా అందజేయాలి. యువతకు పిలుపు: "సోషల్ మీడియాలో రాజకీయాల గురించి గంటల తరబడి పోస్టులు పెడతారు, కానీ మీ ఓటు జాబితాలో ఉందో లేదో ఎప్పుడైనా చూసుకున్నారా? ఓటు లేకపోతే మీ ప్రశ్నకు ప్రజాస్వామ్య బలం ఎక్కడిది? ప్రతి యువకుడు తన కుటుంబంలోని ఓట్లు పోకుండా చూసే బాధ్యత తీసుకోవాలి. అముల్యమైన హక్కు: "ఓటు అంటే కేవలం కాగితం ముక్క కాదు.. అది ప్రజల చేతిలో ఉన్న అధికారం, ప్రశ్నించే హక్కుకు బలమంటూ పిలుపునిచ్చారు.

**రాజకీయ ఆరోపణలు....**



సర్ ప్రక్రియ అనేది రాజకీయ కార్యక్రమం కాదని, ఇది ప్రజాస్వామ్య పరిరక్షణ కార్యక్రమమని బండి సంజయ్ పేర్కొన్నారు. అయితే, కొన్ని ప్రాంతాల్లో కుట్రలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. "కొన్ని చోట్ల సర్ పేరుతో హిందువుల ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మజ్లిస్‌తో కుమ్మక్కైన కాంగ్రెస్ ప్రభుత్వం హిందువుల ఓట్లను తొలగించేందుకు కుట్ర చేస్తోంది. హిందువులంతా అప్రమత్తంగా ఉండి సర్ ప్రక్రియలో పాల్గొనాలి. లేకపోతే తెలంగాణలో హిందువులు మైనారిటీలయ్యే ప్రమాదం ఉంది" అని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు. చివరిగా, ప్రతి ఒక్కరూ పది నిమిషాలు కేటాయించి ఎన్యుమరేషన్ ఫారం నింపాలని, లేనిపక్షంలో పోలింగ్ రోజున 'నా ఓటు ఎక్కడ?' అని బాధపడాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

# కొత్తకోటలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికల) ప్రారంభోత్సవం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
- ముఖ్యమంత్రితో కలిసి హాజరైన ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్

కొత్తకోట/జూలై 15/( జనసంఘర్షణ)






వనపర్తి జిల్లా దేవరకద్ర నియోజక వర్గంలోని కొత్తకోటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రారంభించడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలలో చదివే నేడు ముఖ్యమంత్రి హోదాలో ఉన్నాననీ, ప్రభుత్వ పాఠశాలలో చదవడం గర్వంగా ఫీలవ్వాలని, తెలంగాణ భవిష్యత్ విద్యార్థుల చేతిలోనే ఉంది అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో ఏఐసిసి కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్ ,మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి, శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రణాళిక సంఘం అధ్యక్షుడు చిన్న రెడ్డి, ఎంపి మల్లు రవి, స్థానిక ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, ఎమ్మెల్యేలు కృష్ణ మోహన్, కూచుకుళ్ళ రాజేష్, వీర్లపల్లి శంకర్, మేఘారెడ్డి లు కార్పొరేషన్ చైర్మెన్‌లు శివసేన రెడ్డి, సరిత తదితర ముఖ్య నాయకులు హాజరయ్యారు.

# డీ-అడిక్షన్ సెంటర్‌ను సందర్శించిన భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్

భద్రాచలం/:జూలై15/(జన సంఘర్షణ)



భద్రాచలం డివిజన్ డిఎస్పి యమ్.అరుణ్ కుమార్, పట్టణ సీఐ నాగరాజు తో కలిసి ఈ రోజు భద్రాచలంలోని స్థానిక డీ-అడిక్షన్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడ చికిత్స పొందుతున్న బాధితులతో మాట్లాడి, వారికి అందుతున్న చికిత్స, సదుపాయాల గురించి తెలుసుకున్నారు. తదుపరి మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాలు, మద్యం మరియు ఇతర మత్తు పదార్థాలకు బానిస కావడం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం క్షీణించడమే కాకుండా, కుటుంబ జీవితం ముక్కలవుతుందని మరియు సమాజంలో గౌరవం పోతుందని హెచ్చరించారు. చికిత్స పూర్తి చేసుకున్న తర్వాత బాధితులు పాత అలవాట్లను పూర్తిగా విస్మరించాలని, ఆత్మవిశ్వాసంతో సమాజంలో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, తమ బంగారు భవిష్యత్తు కోసం విద్య, ఉపాధి మరియు కుటుంబ బాధ్యతలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ నాగరాజు, ఎస్ ఐ స్వప్న, డీ-అడిక్షన్ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# 350 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యాన్ని 8 వాహనాలను అధికారులు స్వాధీనం..

ఆర్మూర్/జూలై 15/ (జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ డివిజన్ మున్సిపల్ పట్టణకేంద్రంలో అర్ధరాత్రి సివిల్ సప్లై అధికారి ఓఎస్డీ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన దాడుల్లో 350 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యాన్ని, రవాణాకు ఉపయోగించిన 8 వాహనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

# నిఖత్ జరీన్ తండ్రితో, సీవీ ఆనంద్ భేటీ

నిజామాబాద్ బ్యూరో./జూలై 15/( జన సంఘర్షణ)




నిజామాబాద్లో తన తండ్రితో కలిసి ఆడిన క్రికెట్ జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నందుకు డీజీపీకి నిఖత్ జరీన్ ధన్య వాదాలు తెలిపారు. ఆ పాత జ్ఞాపకాలు తమ కుటుంబానికి ఎంతో ఆనందాన్నిచ్చాయని ఆమె పేర్కొన్నారు. డీజీపీ అందించిన ప్రోత్సాహం, ఆశీస్సులకు కృతజ్ఞత తెలుపుతూ... భవిష్యత్తులో మరింత కష్టపడి భారతదేశానికి, తెలంగాణ రాష్ట్రానికి, తెలంగాణ పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలుస్తానని నిఖత్ ఆకాంక్షించారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
గురువారం
16 జులై 2026

## వైఎస్ఆర్సిపి నాయకులు ముద్రగడ పద్మనాభం మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన వైఎస్ఆర్సిపి రాష్ట్ర నాయకులు డప్పు రాజు





పటాన్చెరు /జూలై /16. (జనసంఘర్షణ )

పటాన్చెరు నియోజకవర్గం తెలంగాణ కాపు ఉద్యమ నేత బడుగు బలహీన వర్గాల ఆశ జ్యోతి మాజీ మంత్రివర్యులు వైఎస్ఆర్సిపి నాయకులు ముద్రగడ పద్మనాభం మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన వైఎస్ఆర్సిపి రాష్ట్ర నాయకులు డప్పు రాజు ఆయన మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా పద్మనాభ శ్వాస కోసం వ్యాధులతో బాధపడుతూ హైదరాబాదులో ఉన్న ఆసుపత్రిలో చికిత్సపంతో ఈరోజు తుది శ్వాస విడిచారు. ఆయన 1953లో తూర్పుగోదావరి జిల్లా కెల్లాపూర్‌లో జన్మించిన ముద్రగడ పద్మనాభ గతంలో వేరే పార్టీలో ఉండి ప్రజలకు సేవలు అందించారు. అలాగే నాలుగు సార్లు ఎమ్మెల్యేగా మంత్రిగా పనిచేసే 2024లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరి కాపు ఉద్యమనేతగా ఎన్నో కార్యక్రమాలు చేసిన నాయకుడిగా పేరుపొంది ఈరోజు తుది శ్వాస విడవడం చాలా బాధాకరం అని డప్పు రాజు ఆయన మరణం పట్ల తీవ్ర సంతపాన్ని వ్యక్తం చేశారు.

## హున్నా శివారులో పేకాట రాయుళ్ల అరెస్ట్

సాలూర/జులై 15/ జన సంఘర్షణ



సాలూర మండలం హున్నా శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.3,710 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. చట్టవ్య తిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని బోధన్ రూరల్ ఎస్సై రాజశేఖర్ హెచ్చరించారు. ఎవరైనా పేకాట ఆడితే సమాచారం అందించాలని వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్సై తెలిపారు.

## చోరీ కేసు ముగ్గురు నిందితులు అరెస్టు

- డీజే సౌండ్ సామగ్రి,టాటా ఏస్ వాహనం చోరీ కేసును ఛేదించిన బీబీపేట్ పోలీసులు ముగ్గురు నిందితుల అరెస్టు
- చోరీకి గురైన టాటా ఏస్ వాహనం, డీజే సౌండ్ సామగ్రి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన బిక్నూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నరేష్

కామారెడ్డి,బీబీపేట్ జులై 15 ( జన సంఘర్షణ )



తుజాల్పూర్ గ్రామంలో జరిగిన డీజే సౌండ్ సామగ్రి చోరీ కేసును బీబీపేట్ పోలీసులు వేగంగా ఛేదించి, ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, చోరీకి గురైన టాటా ఏస్ (మినీ గూడ్స్ క్యారియర్) వాహనంతో పాటు డీజే సౌండ్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

తుజాల్పూర్ గ్రామానికి చెందిన తాడేం శ్రీధర్ (29) తనకు చెందిన భూలక్ష్మి టెంట్ హౌస్ నిర్వహిస్తున్నాడు. తేది 12.07.2026 రాత్రి సుమారు 10:30 గంటలకు తన టాటా ఏస్ వాహనం నెం. AP 20 TB 2717ను షాప్ ముందు పార్క్ చేసి, షాప్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు 13.07.2026 ఉదయం సుమారు 6:30 గంటలకు షాప్‌కు వచ్చి చూడగా షాప్ తాళాలు పగులగొట్టి ఉండటంతో పాటు, షాప్ ముందు పార్క్ చేసిన టాటా ఏస్ వాహనం కనిపించలేదు. అదేవిధంగా డీజే సౌండ్‌కు సంబంధించిన సామగ్రి కూడా చోరీకి గురైంది. దీంతో బాధితుడు బీబీపేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్ ఆదేశాల మేరకు, బిక్నూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నరేష్ పర్యవేక్షణలో, బీబీపేట్ ఎస్‌హెచ్‌ఓ కొండా విజయ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కేసు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాల ఫుటేజ్, సాంకేతిక ఆధారాలు, గ్రామస్తుల సమాచారం ఆధారంగా విచారణ కొనసాగించారు. ఈ క్రమంలో 15-07-2026 నాడు సిరిగాడ బ్రిడ్జి వద్ద బీబీపేట్ పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒక టాటా ఏస్ వాహనం పోలీసులను గమనించి వెనుదిరిగి వెళ్లేందుకు ప్రయత్నించింది. అనుమానం రావడంతో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో డీజే సౌండ్ సామగ్రితో పాటు ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, 12-07-2026 నాడు బీబీపేట్ మండలంలోని తుజాల్పూర్ గ్రామంలో టాటా ఏస్ వాహనం మరియు డీజే సౌండ్ సామగ్రిని దొంగతనం చేసినట్లు అంగీకరించారు. అనంతరం ఆ సామగ్రిని తమ గ్రామానికి తీసుకెళ్లి దాచినట్లు తెలిపారు. విచారణలో భాగంగా పెద్ద నిజాంపేట్, భూంపల్లి, దిలాల్పూర్, రామాయంపేట్ ప్రాంతాల్లో కూడా డీజే సౌండ్ సామగ్రి చోరీలకు పాల్పడినట్లు నిందితులు వెల్లడించారు. దొంగిలించిన సామగ్రిని సిరిసిల్లలో విక్రయించేందుకు తీసుకెళుతున్న సమయంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. పట్టుబడిన ముగ్గురు నిందితులలో ఒకరు మేజర్, ఇద్దరు బాల నేరస్థులు (జజూం). మేజర్ నిందితుడిపై చట్టప్రకారం కేసు నమోదు చేయగా, బాల నేరస్థులను జువెనైల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) చట్టం-2015 నిబంధనల ప్రకారం సంబంధిత జువెనైల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరుపరిచారు.

## బోర్‌వెల్ అనుమతికి రూ.20 వేల లంచం..

- ఏసీబీ వలలో జిల్లా భూగర్భ జలాల అధికారి

హైదరాబాద్/, జూలై 15 /(జన సంఘర్షణ):

సూర్యాపేట జిల్లా భూగర్భ జలాల శాఖలో లంచం తీసుకుంటూ జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి మేగావత్ బాలుతో పాటు ఔట్‌సోర్సింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోసనోజు వెంకటేశ్వర్లు అవినీతి నిరోధక శాఖ అధికారులకు బుధవారం పట్టుబడ్డారు. ఏసీబీ తెలిపిన వివరాల ప్రకారం, ఫిర్యాదుదారుడి బోర్‌వెల్ డ్రిల్లింగ్ రిగ్‌కు అనుమతి మంజూరు చేయడం, అవసరం లేని జరిమానాలు విధించకుండా లేదా రిగ్‌ను స్వాధీనం చేసుకోకుండా ఉండేందుకు జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి మేగావత్ బాలు రూ.20,000 లంచం డిమాండ్ చేశాడు. ఈ మొత్తాన్ని ఔట్‌సోర్సింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోసనోజు వెంకటేశ్వర్ల ద్వారా స్వీకరిస్తుండగా నల్గొండ రేంజ్ ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ వద్ద నుంచి రూ.20 వేల లంచం నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ తెలిపింది. ప్రభుత్వ ఉద్యోగులుగా తమ విధులను దుర్వినియోగం చేసి అక్రమ లాభం పొందేందుకు ప్రయత్నించినట్లు విచారణలో తేలిందని పేర్కొంది. ఇద్దరు నిందితులను నాంపల్లి ప్రత్యేక ఏసీబీ



కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, ఫిర్యాదుదారుడి వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా గోప్యంగా ఉంచినట్లు ఏసీబీ వెల్లడించింది

## ఓటరు జాబితాలో అక్రమాలకు తావివ్వొద్దు

- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి!

బోధన్/ జూలై 15/( జనసంఘర్షణ)



బోధన్ ఆర్‌డీఓ కార్యాలయంలో ఓటర్ల సర్వే, జాబితా సవరణ ప్రక్రియపై ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. "నిర్ణిత గడువు లోపు సర్ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వ సలహా దారు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. బోధన్ ఆర్డివో కార్యాలయంలో బుధవారం అధికారులతో సర్ ప్రక్రియ పై అత్యవసర సమావేశం నిర్వహించారు. సర్ ప్రక్రియను పూర్తి చేయడంపై ప్రతి ఒక్కరు యుద్ధ ప్రాతిపదికన పనిచేయాలని సూచించారు." సరైన కారణాలు లేకుండా విధుల పట్ల గైర్వ జరైతే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటరు జాబితా లో మార్ఫింగ్ గాని ఓటర్ల జెంపింగ్ పై స్పష్టంగా పరిశీలించాలన్నారు. మరణించిన వారి పేర్లను క్షుణ్ణంగా పరిశీలించి ఓటరు జాబితా నుండి తొలగించాలని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ కార్యక్రమం లో ఆర్డివో విజయ కుమారి, మునిసిపల్ కమిషనర్ తూము పద్మ శరత్ రెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నకిలీ కరెన్సీ చలామణి ముఠా గుట్టురట్టు

- ఇద్దరు అరెస్ట్, 8 మందిపై కేసు నమోదు

నిజామాబాద్ ప్రతినిధి/ జులై 15/( జన సంఘర్షణ (



నిజామాబాద్ నగరంలోని 5 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ కరెన్సీ చలామణి జరుగుతోందనే విశ్వసనీయ సమాచారంతో పోలీసులు నిర్వహించిన ప్రత్యేక వాహన తనిఖీల్లో ఇద్దరు నిందితులు పట్టుబడ్డారు. ఈ ఆపరేషన్ను 5 టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ సునీల్ ఆధ్వర్యంలో నాగారం చౌరస్తా వద్ద బుధవారం చేపట్టారు. తనిఖీల సందర్భంగా ఒక మోటార్ సైకిల్పై వస్తున్న షేక్ కైసర్ (తండ్రి: షేక్ హైదర్), రమేష్ గౌడ్ను పోలీసులు నిలిపి తనిఖీ చేశారు. షేక్ కైసర్ వద్ద నకిలీ రూ.500 నోట్లతో పాటు రూ.1,65,000 విలువైన అసలు నగదు, ఐదు మొబైల్ ఫోన్లు, రబ్బర్ బ్యాండ్లు, కవర్లు, ఒక మోటార్ సైకిల్ను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా రమేష్ గౌడ్ వద్ద ఖాళీ సిమ్ కార్డ్ పౌచులు, రూ.5,000 నగదు, రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, ఈ నకిలీ కరెన్సీ చలామణి వ్యవహారంలో మరికొందరి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో మొత్తం ఎనిమిది మంది నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన షేక్ కైసర్, రమేష్ గౌడ్లపై చట్టపరమైన చర్యలు పూర్తి చేసి బుధవారం కోర్టులో హాజరుపర్చగా, న్యాయస్థానం వారిని రిమాండ్కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు.

**దొంగ నోట్ల చలామణిలో కైసర్ కీలక సూత్రధారి**

నిజామాబాద్ 5వ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసిన కైసర్ కు పెద్ద నేర చరిత్ర ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా నకిలీ కరెన్సీ చలామణిలో కీలక సూత్రధారి. గతంలో మహారాష్ట్ర పోలీసులు కైసర్ ను అరెస్ట్ చేశారు. ఫేక్ కరెన్సీ ద్వారా కైసర్ కొద్ది కాలంలోనే కోట్ల రూపాయలు సంపాదించాడని తెలిసింది. గతంలో పోలీస్ యూనిఫామ్ లో తుఫ్రాన్ లో ఒక లాడ్జిలో పత్తాలాడుతున్న వారిని దోచుకున్న కేసులో కైసర్ కీలక సూత్రధారి గా చెబుతారు. తాను విలేకరి అని ఐడి కార్డుతో దందా చేస్తున్నట్టు ప్రచారం ఉంది.

## కాణిపాకం హుండీ ద్వారా రూ 1,83,98,379 ఆదాయం

పూతలపట్టు జూలై 15(జన సంఘర్షణ) :



కాణిపాకం దేవస్థానం హుండీ ద్వారారూ 1,83,98,379 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో పెంచల కిషోర్ తెలిపారు. బుధవారం హుండీలెక్కింపు నిర్వహించారు బంగారం:-49 వెండి:640 గ్రాములు, గోసంరక్షణ హుండీ ద్వారా16,165/ నిత్య అన్నదానం హుండీ ద్వారా -2,20,830/ రూపాయలు. ఫారిన్ కరెన్సీ యుఎస్ఏ 2373. డాలర్స్. యూఏఈ-625. డ్రమ్స్.సింగపూర్ -12. డాలర్స్.మలేషియా -3. రింగ్ గేట్స్పెదీ- 60. రాయల్ఆస్ట్రేలియా -5. డాలర్స్ కెనడా- 65. డాలర్స్. ఈ హుండీ లెక్కింపులో డిఈఓ సాగర్ బాబు, ఏఈఓలు ఎస్ వి కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, ప్రసాద్, ధనంజయ, సిఎఫ్ఓ నాగేశ్వరరావు, పర్యవేక్షకులు కోదండపాణి, శ్రీధర్ బాబు, హుండీ ఇన్స్పెక్టర్ వెంకటేష్, దేవస్థానం సిబ్బంది, సేవకులు, యూనియన్ బ్యాంక్ కాణిపాకం శాఖ, సేవకులు, తదితరులు పాల్గొన్నారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co